# విశాల భారతి

07-05-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 124


## ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ

### ప్రైవేట్ స్కూళ్ల దోపిడీపై వెంటనే చట్టం తేవాలి

- రీయింబర్స్‌మెంట్‌ను దెబ్బతీసే ఎంఎస్-7 జీవోను రద్దు చేయాలి
- పెండింగ్‌లో ఉన్న రూ.11,000 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలి
- స్కూల్‌లో ఫీజుల పెంపు, అవినీతిపై విచారణ జరపాలి
- అధిక ఫీజుల వల్ల కూతుళ్ల చదువు ఆగిపోకూడదు
- టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం హామీ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ధ్వజమెత్తారు. విచ్చలవిడిగా పెరుగుతున్న ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు ఈ నెలలోనే పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన 'నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ' రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రైవేట్ విద్యా మాఫియా సామాన్య మధ్యతరగతి కుటుంబాలను నిలువునా దోచుకుంటున్న తీరును ఆమె ఎండగట్టారు. రాష్ట్ర రాజధానిలోని ప్రతిష్టాత్మక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని ఆమె కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల పెంపుతో తల్లిదండ్రులను భయాందోళనలకు గురిచేస్తున్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, పరోక్షంగా కార్పొరేట్

మిగతా 2లో..

## నా కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బంది పెడతారా?



- చలాన్ల కంటే ట్రాఫిక్ క్లియరెన్స్‌కే మొదటి ప్రాధాన్యత
- విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు
- ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌ల తొలగింపు
- ఏఐ ఆధారిత స్మార్ట్ సిగ్నలింగ్ వ్యవస్థ
- రద్దీ సమయాల్లో పోలీసులు రోడ్లపైనే ఉండాలి
- అంబులెన్స్‌లు, సామాన్యులకు సాఫీగా ప్రయాణం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భాగ్యనగర వాసులను నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ నరకానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. గంటల తరబడి సిగ్నళ్ల వద్ద వేచి ఉండటం, వాహనాల రద్దీతో రోడ్లు దిగ్బంధం కావడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ పోలీసులు విధుల్లో అలసత్వం వహిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో, ఆయన ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో చురకలు అంటించారు. కేవలం జరిమానాలు వసూలు చేయడంపైనే కాకుండా, రోడ్లపై వాహనాల రాకపోకలు సాఫీగా జరిగేలా చూడటంలోనే పోలీసుల సమర్థత ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నగరంలో పెరుగుతున్న వాహనాల

మిగతా 2లో..

## ఈసారి రెడ్లకు నో ఛాన్స్

ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవుల భర్తీకి ముమ్మర కసరత్తు

### బీసీ, ఎస్టీ వర్గాలకే కొత్త పదవులు దక్కే అవకాశం

- ఇప్పటికే నలుగురు ఉన్నందున, ఈసారి ఈ వర్గానికి నో ఛాన్స్
- రేసులో బాలు నాయక్, రామచంద్రు నాయక్; ఒకరికి మంత్రి పదవి ఖాయం.
- పనితీరు బాగోలేని ఇద్దరు ముగ్గురు మంత్రులపై వేటు పడే ఛాన్స్
- మే రెండో వారం తర్వాత, సీఎం ఢిల్లీ పర్యటన అనంతరం విస్తరణ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర రాజకీయ యవనికపై ఇప్పుడు అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణ చుట్టూనే తిరుగుతోంది. అటు ఇంద్రప్రస్థంలో, ఇటు భాగ్యనగరంలో దీనిపైనే ప్రధానంగా చర్చ సాగుతోంది. రాష్ట్ర క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేసేందుకు కసరత్తు ముమ్మరమైంది. ఈ రెండు స్థానాలను బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కట్టబెట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఉన్న సమీకరణాల దృష్ట్యా మరో రెడ్డి

మిగతా 3లో..

## కేటీఆర్ ఒక 420

### కేటీఆర్ దొంగల ముఠాకు నాయకుడని విమర్శ

- కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని కొల్లగొట్టిందని ఆరోపణ
- ఉద్యమకారుల గొంతు కోసి కేటీఆర్ ఎదిగారని మండిపాటు
- దళితుడిని సీఎం చేస్తానన్న హామీపై కేసీఆర్ వంచన
- నిరుద్యోగులను విస్మరించి, మద్యానికి బానిస చేశారు
- బండి సంజయ్ కేవలం 'పిట్టల దొర' అని ఎద్దేవా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు ముదురుతున్నాయి. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును తప్పుపడుతూ ఆయనను ఒక ముఠా నాయకుడిగా అభివర్ణించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. కేటీఆర్ వ్యవహారశైలి సమాజానికి హానికరంగా మారిందని, ఆయన ఒక 420 లాగా వ్యవహరిస్తూ దొంగల బ్యాచ్‌కు నాయకత్వం వహిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలోనే బీజేపీ నేత బండి సంజయ్‌ను సైతం పిట్టల దొరతో పోలుస్తూ కాంగ్రెస్ సారథి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. గత పదేళ్లలో కేటీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదను ఏ విధంగా కొల్లగొట్టిందో ప్రజలందరికీ తెలుసన్నారు. పాస్‌పోర్ట్ కుంభకోణం నుంచి మొదలుకొని భూముల కుంభకోణం వరకు

మిగతా 3లో..

## కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించిన సర్కార్

- 17 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం
- సామాజిక సమతుల్యత పాటిస్తూ పదవుల పంపిణీ
- కుల వృత్తుల సంస్థలకు కొత్త సారథుల ఖరారు
- విద్యావేత్తలకు కీలక బాధ్యతల అప్పగింత
- క్షేత్రస్థాయి పనితీరు కోసం సహాయ నేతల నియామకం
- పార్టీని నమ్ముకున్న నేతలకు దక్కిన గుర్తింపు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు పదవుల పండుగకు తెరలేపింది. రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే కీలకమైన కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఎంతో కాలంగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నేతలు ఆశగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ తొలి విడతలో 17 కార్పొరేషన్లకు సారథులను ఖరారు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేయడంతో గాంధీ భవన్‌లో సందడి నెలకొంది. పార్టీ కార్యకర్తలు, నేతల మధ్య ఉత్సాహం నింపేలా జరిగిన ఈ నియామకాలు రానున్న ఎన్నికల వ్యూహంలో భాగంగా కూడా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం

మిగతా 3లో..

## కార్పొరేషన్లకు నిధులెక్కడ..?

- కార్పొరేషన్లు కేవలం రాజకీయ నియామకాలకే పరిమితమయ్యాయని విమర్శ
- మెజారిటీ కార్పొరేషన్లకు ప్రభుత్వం కనీసం రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపణ
- భారీ కేటాయింపులు చూపి, వాస్తవ ఖర్చులో తీవ్ర విఫలమయ్యారని ధ్వజమెత్తు
- వెనుకబడిన వర్గాల సంస్థలను నిధులు లేకుండా నిర్వీర్యం చేశారని మండిపాటు
- అధికారం, నిధులు లేని పదవులు ప్రజలకు ఉపయోగపడవని స్పష్టం
- పదవులతో పాటు వెంటనే నిధులు విడుదల చేయాలని నిలదీత

02



## రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి



- తెలంగాణ తొలి భద్రతా సలహాదారుగా బాధ్యతలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి హోదా, 3 ఏళ్ల పదవీకాలం
- మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల అదుపుపై ఫోకస్
- ఏఐవంటి టెక్నాలజీతో వ్యవస్థ పటిష్టం
- రాష్ట్ర భద్రతా వ్యూహాల ముసాయిదా రూపకల్పన
- కేంద్ర-రాష్ట్ర భద్రతా సంస్థల మధ్య సమన్వయం

02

## కరోనా కంటే కాంగ్రెస్ డేంజర్

- రైతు డిక్లరేషన్ హామీలు నెరవేర్చని చిత్తు కాగితం
- ఓట్లప్పుడు వచ్చిన రాహుల్ రైతుల కష్టాల్లో లేరని ప్రశ్న
- రైతు గోస పట్టించుకోని రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ రైతు మేళా కేవలం వంచన అని ఎద్దేవా
- పథకాన్ని ఆపడంపై ప్రభుత్వంపై ఆగ్రహం

కాంగ్రెస్ కరోనా కంటి ప్రమాదకరమైన పార్టీ అని విమర్శ



03

# కార్పొరేషన్లకు నిధులెక్కడ..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ రాజకీయ వేడిని రాజేసింది. కొత్తగా మరో 17 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తబోతోంది. ముఖ్యంగా మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పదునైన విమర్శలు సంధించారు. కార్పొరేషన్ పదవుల భర్తీపై ఉన్న శ్రద్ధ, వాటికి నిధులు విడుదల చేయడంలో లేదని ఆయన ఎద్దేవా చేశారు. నిధులు, విధులు లేని కార్పొరేషన్లను కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చడం వల్ల ఒరిగేదేమీ లేదని, ఇది ప్రజలను వంచించడమేనని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర సంక్షేమం కంటే తన అనుచరులను సంతృప్తి పరచడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాల సంక్షేమం కోసం ఉద్దేశించిన కార్పొరేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో 33 కార్పొరేషన్లు ఉనికిలో ఉన్నప్పటికీ, వాటికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. అరకొర నిధులతో కాలక్షేపం చేస్తూ, ఇప్పుడు కొత్తగా మరికొందరికి పదవులు కట్టబెట్టడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవసరమైన సాయం అందించకుండా, కేవలం ఛైర్మన్ల నియామకాలతో కాలం వెళ్లదీయడం వల్ల ఆయా కులాల అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ధోరణి చూస్తుంటే ఇది కేవలం ప్రచార ఆర్భాటమే తప్ప చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోందని పేర్కొన్నారు.

గతంలో నియమించిన 33 కార్పొరేషన్ల దుస్థితిని వివరిస్తూ హరీశ్ రావు కొన్ని సంచలన గణాంకాలను బయటపెట్టారు. మొదటి విడతలో నియమితులైన ఛైర్మన్లలో దాదాపు 21 కార్పొరేషన్లకు ప్రభుత్వం కనీసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆయన ధ్వజమెత్తారు. ఫలితంగా ఆయా ఛైర్మన్లు తమ పదవీ కాలంలో ప్రజలకు ఎటువంటి సాయం చేయలేకపోయారని, కేవలం నామమాత్రపు పదవులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. నిధులు లేని పదవులు ఎవరి ప్రయోజనం కోసమని ఆయన ప్రశ్నించారు. సామాజిక వర్గాల ఆశలను నెరవేర్చాల్సిన సంస్థలు నిధుల కొరతతో వెలవెలబోతుంటే, ప్రభుత్వం మాత్రం కొత్త నియామకాలతో పండుగ



చేసుకుంటోందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్న కార్పొరేషన్ల జాబితాను ఆయన సుదీర్ఘంగా ప్రస్తావించారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కొమురం భీం వంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన సంస్థలతో పాటు ఏకలవ్య, మైనార్టీ, ముదిరాజ్ వంటి వెనుకబడిన వర్గాల కార్పొరేషన్లకు ఒక్క పైసా కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటని హరీశ్ రావు మండిపడ్డారు. యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ వంటి కులవృత్తులపై ఆధారపడిన వర్గాలకు కూడా ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆరోపించారు. ఈ వర్గాల సంక్షేమాన్ని గాలికొదిలేసి, వారి పేరుతో రాజకీయ పబ్బం గడుపుకోవడం కాంగ్రెస్ నైజమని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల పట్ల ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. నిధుల కేటాయింపు, వాస్తవ వ్యయానికి మధ్య ఉన్న అగాధాన్ని ఆయన గణాంకాలతో సహా నిరూపించారు. రాష్ట్రంలోని మొత్తం 33 కార్పొరేషన్లకు గాను ఇప్పటి వరకు రికార్డుల్లో 14,521 కోట్ల రూపాయలను కేటాయించినట్లు చూపారని, కానీ వాస్తవానికి విడుదల చేసింది కేవలం 3,198 కోట్లు మాత్రమేనని హరీశ్ రావు వెల్లడించారు. అందులోనూ వినియోగంలోకి వచ్చింది కేవలం 305 కోట్లు మాత్రమేనని చెప్పడం గమనార్హం. కేటాయింపులు కొండంత ఉంటే, ఖర్చు మాత్రం గోరంత కూడా లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఈ భారీ వ్యత్యాసంపై అసెంబ్లీలో నిలదీసినా ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాకపోవడం వారి అసమర్థతను సూచిస్తోందని దుయ్యబట్టారు. కార్పొరేషన్ల ద్వారా అందాల్సిన లబ్ధి చేకూరకపోవడంతో క్షేత్రస్థాయిలో అసంతృప్తి పెరుగుతోందని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. కేవలం పదవులు ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్ల నిరుద్యోగులకు లేదా స్వయం ఉపాధి కోరుకునే యువతకు ఎటువంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఆయా కులాల సమగ్ర అభివృద్ధి కోసం పక్కా ప్రణాళికతో నిధులు కేటాయించాలని, వాటిని సకాలంలో విడుదల చేసి వినియోగించాలని డిమాండ్ చేశారు. నిధులు లేని కార్పొరేషన్లు దేహానికి ప్రాణం లేని చందంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రణాళికల్లో కేవలం రాజకీయ లెక్కలే తప్ప, సామాజిక న్యాయం ఎక్కడా కనిపించడం లేదని విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ద్వంద్వ విధానం వల్ల సామాన్య ప్రజలు నష్టపోతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమ పథకాల అమలులో కోతలు విధిస్తూ, మరోవైపు భారీగా నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం ఏ రకమైన పరిపాలన అని ప్రశ్నించారు. ప్రజల సొమ్మును కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదని హితవు పలికారు. కార్పొరేషన్ల ఉద్దేశ్యం నెరవేరాలంటే వాటికి స్వయంప్రతిపత్తితో పాటు ఆర్థిక వెసులుబాటు కల్పించాలని సూచించారు. అలా కాకుండా కేవలం అనుచరులకు జీతభత్యాలు కల్పించే కేంద్రాలుగా వీటిని మార్చడం వల్ల ప్రజాధనం వృధా అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ తీరుపై ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు. తెలంగాణ సమాజంలో కులవృత్తులకు, వెనుకబడిన వర్గాలకు ఇచ్చే ప్రాధాన్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో ఉన్న కార్పొరేషన్లే నిధులు లేక అల్లాడుతుంటే, ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన 17 కార్పొరేషన్లకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారని నిలదీశారు. ఇది కేవలం ఎన్నికల హామీలను నెరవేర్చినట్లు భ్రమ కలిగించే ప్రయత్నమని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి నిర్ణయం వెనుక రాజకీయ కోణం తప్ప, ప్రజా హితం లేదని మండిపడ్డారు. సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టేలా కాకుండా, అందరికీ సమానమైన అవకాశాలు కల్పించేలా నిధుల పంపిణీ జరగాలని హితవు పలికారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి సంక్షేమాన్ని విస్మరించడం తగదని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నిర్ణయాలను పునఃసమీక్షించుకోవాలని హరీశ్ రావు కోరారు. కేవలం నియామక ఉత్తర్వులతో సరిపెట్టకుండా, ఆయా కార్యాలయాల నిర్వహణకు మరియు పథకాల అమలుకు అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాన్ని ఖర్చు చేయకుండా కాలయాపన చేయడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో కార్పొరేషన్ల పాత్ర కీలకమని, వాటిని శక్తివంతం చేయాల్సింది పోయి బలహీనపరచడం రాష్ట్ర భవిష్యత్తుకు శ్రేయస్కరం కాదని అన్నారు. ప్రతిపక్షంగా తాము నిరంతరం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు నిధుల కోసం ఎదురుచూస్తున్నారని, కేవలం పదవుల కోసం కాదని హరీశ్ రావు గుర్తు చేశారు. అభివృద్ధి అనేది గణాంకాల్లో కాకుండా ప్రజల జీవితాల్లో ప్రతిబింబించాలని కోరారు. కార్పొరేషన్ల ద్వారా అందే రుణాలు, సబ్సిడీలు పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తాయని, ఆ ఆసరాను దూరం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, నామినేటెడ్ పదవుల హడావుడి పక్కన పెట్టి వాస్తవ అభివృద్ధిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించినప్పుడే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కంటే సామాజిక బాధ్యత ముఖ్యమని గుర్తుంచుకోవాలని సూచించారు. మొత్తానికి తెలంగాణలో కార్పొరేషన్ల భర్తీ అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన టీమ్‌ను సిద్ధం చేసుకుంటున్న తరుణంలో, హరీశ్ రావు సంధించిన నిధుల ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. నిధులు లేని కార్పొరేషన్లు ఎలా పనిచేస్తాయి? కొత్తగా నియమితులైన ఛైర్మన్లు తమ వర్గాలకు ఏ మేరకు న్యాయం చేయగలరు? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో ఈ కార్పొరేషన్లకు నిధుల విడుదల ఏ విధంగా ఉంటుందో, హరీశ్ రావు చేసిన విమర్శలకు ప్రభుత్వం ఎలా సమాధానమిస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా ప్రజాస్వామ్యంలో నిధులు, విధులు లేని పదవులు కేవలం అలంకారప్రాయంగానే మిగిలిపోతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ

**మొదటిపేజీ తరువాయి**

సంస్థలకు మేలు చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నా, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్తూ వారిని ప్రోత్సహించడం దురదృష్టకరమని విమర్శించారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేకపోవడం వల్ల పర్యవేక్షణ లోపించిందని, దీనివల్ల విద్యావ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని పేర్కొన్నారు. సామాన్యుడికి నాణ్యమైన విద్యను దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజలు చైతన్యవంతులు కావాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణలో మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని, తమ వార్షిక ఆదాయంలో దాదాపు 60 నుంచి 70 శాతం కేవలం విద్య, వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోందని కవిత వివరించారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడే తపనను ప్రైవేట్ విద్యాసంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని మెజారిటీ పాఠశాలలు ఈ ఏడాది 50 నుంచి 120 శాతం వరకు ఫీజులు పెంచాయని, ఇది మే నెలలో తల్లిదండ్రులకు ఒక పీడకలలా మారిందని అన్నారు. ఫీజుల భారం తట్టుకోలేక చాలా కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఈ విద్యా సంవత్సరంలో ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఎంఎస్7 జీవో విద్యా వ్యవస్థకు శాపంగా మారిందని, ఇది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉందని విమర్శించారు. రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో వేస్తామన్న నిబంధన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, సకాలంలో నిధులు విడుదల చేయకపోయినా ఎవరూ ప్రశ్నించకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. రాజకీయ పార్టీలన్నీ ఏకమై ఈ జీవోను రద్దు చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న రూ. 11,000 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యాసంస్థలను, విద్యార్థులను ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఫీజుల భారం పెరగడం వల్ల సమాజంలో లింగ వివక్ష పెరిగే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మాన్పించాల్సి వస్తే, తల్లిదండ్రులు మొదట ఆడపిల్లలనే ఇంటికే పరిమితం చేసే పరిస్థి



తి తలెత్తుతుందని గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరి వల్ల ఆడబిడ్డల ఉన్నత చదువుల కలలు కల్లలయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందాల్సిన ఆర్థిక సాయాన్ని నిలిపివేయడం అంటే వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందక చాలా కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని, దీనివల్ల వేల మంది విద్యార్థులు వీధిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో జరుగుతున్న భారీ అవినీతిపై కవిత ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ భూముల్లో నడుస్తున్న ఈ పాఠశాల ఈ ఏడాది అడ్డగోలుగా ఫీజులు పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్కడ ఏళ్ల తరబడి కొందరు వ్యక్తులు తిష్టవేసి అవినీతికి పాల్పడుతున్నారని, వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. సత్య నాదెళ్ల వంటి ప్రముఖ పూర్వ విద్యార్థులు ఇచ్చిన భారీ విరాళాల లెక్కలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. స్కూల్‌కు చెందిన విలువైన 30 ఎకరాల భూమిని ముఖ్యమంత్రికి సన్నిహితులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1200 మంది అమరవీరులు ప్రాణత్యాగం చేశారని, ఎంతో మంది విద్యార్థులు లాఠీ దెబ్బలు తిన్నారని కవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు. సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగాల్సి ఉందని, కానీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఫీజు నియంత్రణ విషయంలో ఆశించిన స్థాయిలో అడుగులు వేయలేకపోయిందని ఆమె నిజాయితీగా అంగీకరించారు. తిరుపతి రావు కమిషన్ నివేదిక ఇచ్చినా దానిని అమలు చేయడంలో విఫలమయ్యామని, అయితే ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే దారిలో నడవడం సరికాదని హితవు పలికారు.

# రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణలో ఒక కీలకమైన మైలురాయి ఆవిష్కృతమైంది. రాష్ట్ర తొలి భద్రతా సలహాదారుగా సీనియర్ ఐపీఎస్ అధికారి బి.శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే రాష్ట్ర పోలీస్ బాస్ (డీజీపీ)గా పదవీ విరమణ చేసిన ఆయన అనుభవాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయనను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) హోదాతో కూడిన అత్యున్నత పదవిలో నియమిస్తూ గతంలోనే ఉత్తర్వులు జారీ చేయగా, తాజాగా ఆయన విధుల్లో చేరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలాంటి ఒక ప్రత్యేక భద్రతా సలహాదారు పోస్టును ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాత్మక నిర్ణయాల్లో భాగంగా ఏర్పడిన ఈ నూతన వ్యవస్థ ద్వారా అంతర్గత భద్రతను మరింత పటిష్టం చేయాలని సర్కారు భావిస్తోంది. శాంతిభద్రతల నిర్వహణలో దశాబ్దాల కాలం పాటు శివధర్ రెడ్డి గడించిన అపార అనుభవం రాష్ట్రానికి దిక్సూచిగా మారుతుందని పారిశ్రామిక మరియు సామాజిక వర్గాలు భావిస్తున్నాయి. కేవలం నేర నియంత్రణకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వ్యవస్థను ఆధునీకరించడంలో ఆయన పాత్ర కీలకం కానుంది. ఈ నియామకం ద్వారా పోలీస్ యంత్రాంగానికి మరియు ప్రభుత్వానికి మధ్య ఒక బలమైన వారధి ఏర్పడినట్లయింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కార్యాలయంలో శివధర్ రెడ్డికి ప్రత్యేక ఛాంబర్‌ను కేటాయించారు. ఆయన ఈ బాధ్యతల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితులు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, మరియు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఆయన నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు. ముఖ్యంగా రాజధాని నగరం అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్న తరుణంలో, మదుపర్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సుస్థిరమైన భద్రతా వాతావరణాన్ని కల్పించడంపై ఆయన దృష్టి సారించనున్నారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఉన్న ఈ కార్యాలయం నుండి ఆయన విధులను సమన్వయం చేస్తారు. పోలీస్ శాఖలో వివిధ విభాగాల మధ్య సమన్వయం పెంచడం శివధర్ రెడ్డి ప్రధాన బాధ్యతల్లో ఒకటిగా ఉంది. లా అండ్ ఆర్డర్, అంతర్గత భద్రత, క్రైం కంట్రోల్ వంటి కీలక విభాగాలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. నేరాల అదుపులో వినూత్న పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలకు మరింత భరోసా కల్పించేలా పోలీస్ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయనున్నారు. విచారణా ప్రక్రియలో పారదర్శకత, కేసుల ఛేదనలో వేగం పెంచేందుకు అవసరమైన సలహాలను ఆయన ప్రభుత్వానికి అందిస్తారు. సీనియర్ అధికారిగా క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆయనకున్న పట్టు భవిష్యత్ ప్రణాళికల రచనకు ఎంతగానో దోహదపడనుంది. ప్రస్తుత సమాజంలో పెను సవాలుగా మారిన మాదక ద్రవ్యాల నియంత్రణపై ఆయన ప్రత్యేక దృష్టి సారించనున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో కార్యకలాపాలను పటిష్టం చేస్తూ, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కఠినమైన చర్యలు తీసుకోవడంలో ఆయన సలహాలు కీలకం కానున్నాయి. డ్రగ్స్ రవాణా నెట్‌వర్క్‌లను ఛేదించడం, విద్యాసంస్థల్లో అవగాహన పెంచడం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నారు. అలాగే రోడ్డు భద్రతా విభాగంలో మరణాల రేటును తగ్గించేందుకు, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు అవసరమైన వ్యూహాలను ఆయన పర్యవేక్షించనున్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే శివధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో గవర్నర్ ఆయనకు అభినందనలు తెలియజేయడమే కాకుండా, రాష్ట్ర భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. సరిహద్దు భద్రత, సైబర్ నేరాల ముప్పు, మరియు పెరుగుతున్న సాంకేతిక నేరాలను ఎలా ఎదుర్కోవాలో ఇరువురు చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా భద్రతా సలహాదారు వ్యవస్థ శక్తివంతంగా పనిచేయాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఈ సరికొత్త నియామకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం భద్రత విషయంలో రాజీపడబోమని స్పష్టమైన సంకేతాలను పంపింది. ఒకవైపు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రం, మరోవైపు భద్రతాపరమైన సవాళ్లను కూడా ధీటుగా ఎదుర్కోవాల్సి ఉంది. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో మారుతున్న భద్రతా సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర పోలీసు వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో శివధర్ రెడ్డి అనుభవం తోడ్పడనుంది. నిఘా వ్యవస్థను (ఇంటెలిజెన్స్) మరింత బలోపేతం చేయడం ద్వారా ముందస్తుగానే ప్రమాదాలను పసిగట్టి నివారించేలా చర్యలు చేపట్టనున్నారు. డిజిటల్ యుగంలో సైబర్ భద్రత అనేది పెద్ద సవాలుగా మారింది. సామాన్యుల నుంచి పెద్ద సంస్థల వరకు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న తరుణంలో, డేటా భద్రత మరియు ఆన్‌లైన్ మోసాల నియంత్రణపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపనున్నారు. రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులకు ఆధునిక శిక్షణ ఇవ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేయడం వంటి అంశాలపై ఆయన ప్రభుత్వానికి సిఫార్సులు చేయనున్నారు. సైబర్ సెక్యూరిటీ విషయంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ఆయన తన కార్యకలాపాలను ప్రారంభించనున్నారు. శివధర్ రెడ్డి గతంలో ఇంటెలిజెన్స్ విభాగంలో మరియు జిల్లా స్థాయిలో ఎస్పీగా పనిచేసిన కాలంలో సాధించిన విజయాలు ఈ పదవికి ఆయనను అత్యంత యోగ్యునిగా చేశాయి. క్లిష్ట సమయాల్లో సంయమనంతో వ్యవహరిస్తూనే, నిర్ణయాల తీసుకోవడంలో ఆయన చూపే వేగం పోలీస్ శాఖలో అందరికీ ఆదర్శంగా ఉంటుంది. ఇప్పుడు భద్రతా సలహాదారుగా ఆయనకు దక్కిన బాధ్యతలు మరింత విస్తృతమైనవి. పోలీసు సంక్షేమం, సిబ్బంది నైపుణ్యాల పెంపుదల, మరియు ప్రజల మధ్య పోలీసులకు ఉన్న ప్రతిష్టను మెరుగుపరచడం వంటి అంశాలపై కూడా ఆయన తనదైన ముద్ర వేయనున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పెద్దపీట వేయడం ప్రభుత్వాల ప్రాథమిక విధి. ఈ క్రమంలో భద్రతా సలహాదారు పోస్టు కేవలం అలంకారప్రాయం కాకుండా, కార్యాచరణాత్మకంగా ఉండాలని పౌర సమాజం కోరుకుంటోంది. పోలీసుల పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించి, నమ్మకాన్ని పెంచేలా 'ఫ్రెండ్లీ పోలీసింగ్' భావనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర ఉండబోతోంది. శాంతిభద్రతలు సజావుగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. చివరగా, శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ చరిత్రలో ఒక నూతన విప్లవానికి నాంది పలికినట్లయింది. మున్ముందు రాబోయే మూడేళ్ల కాలంలో ఆయన నాయకత్వంలో రాష్ట్ర భద్రతా వ్యవస్థ ఎన్నో మార్పులకు లోనుకానుంది. నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తారని పౌరులు ఆశిస్తున్నారు. సమర్థవంతమైన పర్యవేక్షణ, సరైన సలహాలు మరియు పటిష్టమైన అమలు ద్వారా తెలంగాణను భద్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చడమే ఈ కొత్త వ్యవస్థ ముందున్న ప్రధాన లక్ష్యం. అభివృద్ధి మరియు భద్రత జోడెద్దుల వలె సాగినప్పుడే బంగారు తెలంగాణ కల సాకారమవుతుంది.

# నా కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బంది పెడతారా?



**మొదటిపేజీ తరువాయి**

సంఖ్యకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అనేది కేవలం పోలీసుల విధి మాత్రమే కాదని, అది నగర ప్రతిష్టకు సంబంధించిన అంశమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ పోలీసులు రోడ్ల మీద కనిపించడం లేదని, చాలా చోట్ల వారు నీడ పట్టున ఉంటూ వాహనాల రాకపోకలను గాలికొదిలేస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ అధికారి అయినా తన పరిధిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించలేకపోతే అది వారి వైఫల్యంగానే పరిగణిస్తామని తేల్చి చెప్పారు. ఇకపై ట్రాఫిక్ నియంత్రణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని హోంశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మార్పు కనిపించకపోతే స్వయంగా తనిఖీలు చేపడతానని స్పష్టం చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ జామ్ కావడం వల్ల అత్యవసర సేవలైన అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు చిక్కుకుపోవడంపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం వీఐపీల రాకపోకల సమయంలోనే కాకుండా, సామాన్య పౌరులు ప్రయాణించే సమయంలో కూడా రోడ్లు సాఫీగా ఉండాలని సూచించారు. పోలీసులు సాంకేతికతను వాడుకుంటూ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ చేయాలని, ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగినన్ని నిధులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిగ్నల్ వ్యవస్థల పనితీరుపై కూడా ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. చాలా చోట్ల టైమర్లు సరిగ్గా పనిచేయకపోవడం, అవసరం లేని చోట కూడా ఎక్కువ సేపు ఎరుపు రంగు సిగ్నల్ ఉండటం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గమనించారు. స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ఏఐ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి వాహనాల సాంద్రతను బట్టి సిగ్నల్ సమయాలను స్వయంచాలకంగా మార్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు కేవలం చలాన్లపైనే దృష్టి పెట్టకుండా, రోడ్డుపై వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ క్లియరెన్స్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందే, కానీ అది ట్రాఫిక్ ప్రవాహానికి అడ్డు కాకూడదని పేర్కొన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణలు కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమని గుర్తించారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలు వెలవడం, రోడ్ల పక్కన అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ మరియు ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసి ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఒకవేళ ఆక్రమణలు మళ్లీ వెలిస్తే సంబంధిత సర్కిల్ అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. పాదచారులకు నడిచే దారి లేకుండా రోడ్లపైకి రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. క్రమశిక్షణతో కూడిన రవాణా వ్యవస్థను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. విధుల్లో భాగంగా రోడ్లపై ఉండే హోంగార్డుల నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఎండనక, వాననక రోడ్డుపై నిలబడి విధి నిర్వహణ చేసే కింది స్థాయి సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలని, అదే సమయంలో వారు సరిగ్గా పనిచేస్తున్నారో లేదో పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులు సామాన్య ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, అదే సమయంలో నిబంధనల విషయంలో రాజీ పడకూడదని వివరించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని, సోషల్ మీడియా ద్వారా వచ్చే విన్నపాలను తక్షణమే గమనించి చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా, ఐటీ రంగం విస్తరించాలన్నా మౌలిక సదుపాయాలతో పాటు మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థ ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ ఎదుగుతున్న తరుణంలో, గంటల కొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం వల్ల నగర ప్రతిష్ట దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు నగరానికి వచ్చినప్పుడు వారికి మంచి అనుభూతిని కలిగించేలా రవాణా వ్యవస్థ ఉండాలని కోరారు. ఇందులో భాగంగా మెట్రో విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం వంటి దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నప్పటికీ, తక్షణ ఉపశమనం కోసం ట్రాఫిక్ పోలీసుల నిర్వహణ మెరుగుపడాలని ఆయన స్పష్టమైన సందేశం ఇచ్చారు. పోలీస్ అధికారుల బదిలీలు, పదోన్నతుల విషయంలో కూడా పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమర్థవంతంగా పనిచేసే అధికారులకు ప్రోత్సాహకాలు ఉంటాయని, విధి నిర్వహణలో విఫలమయ్యే వారిని పక్కన పెడతామని హెచ్చరించారు. ముఖ్యంగా కీలకమైన జంక్షన్లలో బాధ్యత వహించే అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా రద్దీ ఏర్పడితే వెంటనే అదనపు సిబ్బందిని తరలించి క్లియర్ చేయాలని సూచించారు. ఇకపై ట్రాఫిక్ నియంత్రణలో ఎటువంటి సాకులు వినదలుచుకోలేదని, ఫలితాలనే ఆశిస్తున్నానని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో మార్పు వచ్చే వరకు తాను పర్యవేక్షిస్తూనే ఉంటానని అధికారులకు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న పోలీస్ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. నగరవ్యాప్తంగా రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అదనపు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వివరించారు. ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి సీరియస్ హెచ్చరికలు జారీ చేయడంతో పోలీస్ యంత్రాంగంలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. రానున్న రోజుల్లో నగర రోడ్లపై ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయని వాహనదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరు మెరుగుపరచడంతో పాటు వాహనదారుల బాధ్యత కూడా ఉంటుందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, లైన్ క్రమశిక్షణ పాటించకపోవడం వంటి అంశాలపై కఠినంగా ఉండాలని చెప్పారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సెలబ్రిటీలు, స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకోవాలని సూచించారు. స్కూళ్లు, కాలేజీలు ఉన్న ప్రాంతాల్లో పిల్లల భద్రత దృష్ట్యా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అక్కడ ట్రాఫిక్ ఆటంకాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. సమిష్టి కృషితోనే భాగ్యనగరాన్ని ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతిమంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం నగర ప్రయాణికులకు ఊరటనిచ్చే విషయమే. నిరంతరం ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని అధికారుల తీరుపై ఆయన ఉక్కుపాదం మోపడం శుభపరిణామమని పౌర సమాజం అభిప్రాయపడుతోంది. పాలకుల చిత్తశుద్ధి, అధికారుల సమర్థత తోడైతేనే అసాధ్యం అనుకున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కేవలం కాగితాల మీద ప్రణాళికలు కాకుండా, రోడ్ల మీద వాహనాలు సాఫీగా కదులుతున్నప్పుడే ప్రజల్లో సంతృప్తి కలుగుతుంది.

# కరోనా కంటే కాంగ్రెస్ డేంజర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రస్తుత ప్రభుత్వ వైఖరి కరోనా మహమ్మారి కంటే అత్యంత ప్రమాదకరంగా మారిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హనుమకొండ వేదికగా బుధవారం నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, అధికార పక్షంపై విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణాలో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, పాలకుల నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు ఆత్మహత్యల దిశగా వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసమేనని, ఇప్పుడు అధికారం దక్కాక రైతులను నడిసముద్రంలో ముంచేశారని మండిపడ్డారు. వరంగల్ వేదికగా గతంలో రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను కేటీఆర్ ఒక నయవంచనగా అభివర్ణించారు. గల్లీలో తిరిగే తొట్టి గ్యాంగ్‌ను వెంటేసుకుని వచ్చి, రైతుల జీవితాలను మారుస్తామని ప్రగల్భాలు పలికిన రాహుల్ గాంధీ, ఇప్పుడు ఆ హామీల ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఆ డిక్లరేషన్ ప్రకటించి నాలుగేళ్లు పూర్తవుతున్నా, అందులో పేర్కొన్న 34 కీలక హామీలలో ఒక్కటి కూడా నేటికీ అమలు కాలేదని ఆయన గుర్తు చేశారు. రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని, కేవలం ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కడానికి ఉపయోగించిన చిత్తు కాగితమని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ నమ్మకద్రోహానికి ఈ పత్రమే నిదర్శనమని స్పష్టం చేశారు. నాడు ఎన్నికల ప్రచారం కోసం ఢిల్లీ నుంచి తరలివచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు రాష్ట్రంలో రైతులు కరువుతో, అకాల వర్షాలతో అల్లాడుతుంటే ఎక్కడ దాక్కున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. పంటలు ఎండిపోయి, మద్దతు ధర లేక రైతులు గోస పడుతుంటే రాహుల్ గాంధీకి పట్టింపు లేదని విమర్శించారు. రైతుల కళ్లలో రక్తం కారుతుంటే పాలకులకు కనీసం కనికరం కలగడం లేదని ఆవేదన చెందారు. అన్నం పెట్టే రైతు కంచంలో మన్ను పోసే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బాధ్యతలను విస్మరించి, పాలనను గాలికి వదిలేశారని ఆయన ఎద్దేవా చేస్తూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకులు సిగ్గు శరం లేకుండా మెగా రైతు మేళా నిర్వహిస్తున్నారని, అది నిజానికి మేళా కాదని, అది 'దగా రైతు మేళా' అని కేటీఆర్ అభివర్ణించారు. రైతులను మోసం చేయడంలో కాంగ్రెస్ సరికొత్త రికార్డులు సృష్టిస్తోందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ అగ్రనేతలందరూ చెడ్డీ గ్యాంగ్ కంటే ప్రమాదకరమైన వ్యక్తులని ఆయన విమర్శించారు. ప్రజలు వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వీరి ఫొటోలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లలో ప్రదర్శించి,



'దొంగలున్నారు జాగ్రత్త' అనే బోర్డులు పెట్టాలని ఆయన ప్రజలకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం చేసిన కృషిని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పాలనలో రైతు బంధు పథకం ద్వారా సాగు పెట్టుబడి సాయాన్ని అందించి అన్నదాతకు అండగా నిలిచారని కొనియాడారు. కేసీఆర్ హయాంలో 11 విడతల్లో సుమారు 73 వేల కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా, ఏ ఇబ్బంది కలగకుండా రైతులను రాజులుగా చూసుకున్నామని ఆయన పేర్కొన్నారు. కానీ నేడు పరిస్థితి దారుణంగా మారిందని, పెట్టుబడి సాయం అందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయిందని కేటీఆర్ విమర్శించారు. రుణమాఫీ మొదలుకొని ధాన్యం బోనస్ వరకు అన్ని విషయాల్లోనూ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రైతులను ఆదుకోవాల్సిన సమయంలో కాలయాపన చేస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం రాకముందు రైతులకు స్వర్గం చూపిస్తామని చెప్పిన నేతలు, ఇప్పుడు వారిని పట్టించుకోకపోవడం అత్యంత దారుణమని అన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని రైతాంగం ఎన్నటికీ క్షమించదని ఆయన హెచ్చరించారు. రైతు బంధు నిధుల నిలిపివేతపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విరుచుకుపడ్డారు. రైతుల ఖాతాల్లో పడాల్సిన పైసలను ఆపడానికి మీరెవరని ఆయన ప్రశ్నించారు. "రైతు బంధు ఆపడానికి ఆ నిధులేమైనా నీ అయ్యా సొమ్మా? లేక నీ అబ్బా సొమ్మా?" అంటూ ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఘాటైన ప్రశ్నలు వేశారు. అన్నదాతల హక్కుగా వచ్చే సొమ్మును అడ్డుకోవడం దుర్మార్గమని విమర్శించారు. పేద రైతుల నోటికాడ ముద్దను లాక్కుంటున్న ప్రభుత్వ తీరును ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. రైతుల ఆగ్రహానికి గురైతే ఈ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని కేటీఆర్ తనదైన శైలిలో తిట్ల దండకంతో విమర్శించారు. రేవంత్ రెడ్డి ఒక 'హౌలా', 'దివానా', 'ధోఖే బాజ్' అంటూ తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. రైతులను వంచించడమే ధ్యేయంగా పెట్టుకున్న ఇలాంటి వ్యక్తుల చేతిలో రాష్ట్రం ఉండటం దురదృష్టకరమని అన్నారు. ప్రతి అడుగులోనూ మోసం చేస్తూ, అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకుల మాటలకు, చేతలకు పొంతన ఉండదని ప్రజలకు అర్థమైందని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడాల్సిన నేతలు ఇప్పుడు కాంట్రాక్టర్ల పక్షాన నిలబడుతున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు పడుతున్న ఇబ్బందులను కేటీఆర్ వివరించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, కరెంటు కోతలతో రైతులు రాత్రంతా పొలాల వద్దే గడపాల్సి వస్తోందని చెప్పారు. గతంలో కేసీఆర్ తెచ్చిన సాగు విప్లవం ఇప్పుడు వెనక్కి మళ్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కోసం క్యూ కట్టాల్సిన పరిస్థితి మళ్ళీ వచ్చిందని, విత్తనాల కొరత వేధిస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన కేసీఆర్ పాలనను రైతులు నేడు తలచుకుంటున్నారని చెప్పారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఇప్పుడు వారినే వేధింపులకు గురి చేస్తోందని ఆయన ఆరోపించారు. హనుమకొండ రైతు సంగ్రామ సదస్సు ద్వారా పాలకులకు ఒక హెచ్చరిక పంపారు. రైతులు తిరగబడితే ఏ శక్తీ అడ్డుకోలేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని, రైతు బంధు నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే వరి ధాన్యానికి ప్రకటించిన బోనస్‌ను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఊరూరా కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటామని, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, వారి న్యాయమైన హక్కుల కోసం వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. చివరగా, తెలంగాణ సమాజం కాంగ్రెస్ కుటిల నీతిని అర్థం చేసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మాయమాటలు చెప్పి అధికారం దక్కించుకున్న వారు ఇప్పుడు అసలు రంగు బయటపెడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రైతులే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి ఢిల్లీ పెద్దల మెప్పు కోసం పాకులాడుతున్న పాలకులను ఇంటికి పంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు. తెలంగాణ గడ్డపై మళ్ళీ కేసీఆర్ నాయకత్వంలో రైతు రాజ్యం వస్తుందని, అప్పుడే అన్నదాతలకు అసలైన న్యాయం జరుగుతుందని కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు. అన్నదాతల పోరాటానికి అందరూ మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఈసారి రెడ్లకు నో ఛాన్స్

**మొదటిపేజీ తరువాయి**

సామాజిక వర్గానికి చోటు కల్పించవద్దని అటు ఏఐసీసీ పెద్దలు, ఇటు ముఖ్యమంత్రి ఒక ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ఢిల్లీ కాంగ్రెస్ వర్గాల సమాచారం. సామాజిక న్యాయం పాటించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామం ఆశావహుల్లో ఉత్కంఠను పెంచుతుండగా, కొత్త ముఖాలకు అవకాశం దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుత మంత్రివర్గ కూర్పును లోతుగా పరిశీలిస్తే, ఇద్దరు లేదా ముగ్గురు మంత్రుల పనితీరుపై అధిష్ఠానం అంత సంతృప్తిగా లేదని ప్రచారం జరుగుతోంది. దీంతో వారిని బాధ్యతల నుంచి తప్పించి, వారి స్థానంలో కొత్త వారికి ఛాన్స్ ఇవ్వొచ్చనే ఊహాగానాలు గత కొన్ని రోజులుగా జోరుగా వినిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న రెండు స్థానాలతో పాటు, ఈ మార్పులు కూడా జరిగితే మంత్రివర్గం సరికొత్త రూపురేఖలను సంతరించుకోనుంది. ఎవరికి ఉద్వాసన పలుకుతారు, ఎవరికి పట్టం కడతారు అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. జిల్లాల వారీగా ఉన్న రాజకీయ ప్రాబల్యం, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ లోపు ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తూ అధిష్ఠానం వద్దకు రాయబారాలు పంపిస్తున్నారు. మంత్రివర్గంలో సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా చూడాలని కాంగ్రెస్ హైకమాండ్ గట్టి పట్టుదలతో ఉంది. అందుకే ఖాళీగా ఉన్న రెండు స్థానాల్లో ఒక బీసీ, ఒక ఎస్టీ (లంబాడా)కి ఇవ్వాలని దాదాపుగా ఖరారైనట్లు పార్టీ అంతర్గత వర్గాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్ర జనాభాలో సింహభాగం ఉన్న బీసీలకు ప్రాధాన్యం పెంచడం ద్వారా రానున్న రోజుల్లో రాజకీయంగా పట్టు సాధించవచ్చని పార్టీ భావిస్తోంది. అదే విధంగా గిరిజన సామాజిక వర్గాల్లో బలమైన పట్టున్న లంబాడాలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆ వర్గాల మద్దతును మరింత సుస్థిరం చేసుకోవచ్చనేది వ్యూహం. ఈ లోపు ఒకసారి ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లే అవకాశం ఉంది. ఆ పర్యటన తర్వాతే ఈ మంత్రివర్గ మార్పులపై పూర్తి స్పష్టత వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.లంబాడా సామాజిక వర్గానికి ఒక మంత్రి పదవిని కేటాయించాలనే విషయంలో ఇప్పటికే సీఎం, ఏఐసీసీ నేతల మధ్య ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయి. ఈ రేసులో ప్రధానంగా బాలు నాయక్, రామచంద్రు నాయక్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, రామచంద్రు నాయక్ పేరును ఇప్పటికే డిప్యూటీ స్పీకర్ పదవికి ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ఇంకా ఆ బాధ్యతలు చేపట్టకపోవడంతో, ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుని బాలు నాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా పంపడంపై



పార్టీలో ఒక రకమైన చర్చ జరుగుతోంది. కానీ, ఇప్పటికే ఒక పదవికి పేరు ప్రకటించిన తర్వాత ఆ స్థానంలోకి వెళ్లడానికి బాలు నాయక్ సముఖంగా లేరని సమాచారం. మంత్రి పదవిపైనే ఆయన గట్టి ఆశలు పెట్టుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు నలుగురు ఉండగా, ఎస్సీలు నలుగురు, బీసీలు ముగ్గురు, అగ్రవర్ణాలు ముగ్గురు, మైనారిటీ ఒకరు, ఎస్టీ ఒకరు చొప్పున ఉన్నారు. ఈ కూర్పును పరిశీలిస్తే బీసీ, లంబాడా వర్గాలకు అదనంగా చోటు కల్పిస్తే సోషల్ జస్టిస్ ఈక్వేషన్ పక్కాగా సెట్ అవుతుందనేది ఏఐసీసీ పెద్దల భావన. రాష్ట్రంలో బీసీ జనాభా సుమారు 56 శాతంగా ఉన్నందున, వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయం చేశామనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపాలని పార్టీ యోచిస్తోంది. ఇప్పటికే బీసీల్లో ముదిరాజ్, గౌడ్, పద్మశాలి సామాజిక వర్గాలకు మంత్రి పదవులు దక్కాయి. ఇప్పుడు నాలుగో బీసీ మంత్రిగా ఏ కులానికి అవకాశం ఇస్తారనేది అత్యంత కీలకంగా మారింది. మున్నూరు కాపు సామాజిక వర్గానికి సంబంధించి ఇటీవల ఒకరికి మంత్రి హోదాతో కూడిన సలహాదారు పోస్టును కేటాయించారు. ఇప్పుడు అదే సామాజిక వర్గానికి మంత్రి పదవి కూడా ఇస్తారా అన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి అధిష్టానంతో చర్చించిన తర్వాతే దీనిపై ఒక క్లారిటీ రానుంది. కేవలం సామాజిక వర్గమే కాకుండా, సదరు నేతకున్న నియోజకవర్గ స్థాయి బలం, జిల్లా రాజకీయాలపై ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. ఆశావహుల జాబితా ఎక్కువగా ఉన్నప్పటికీ, సామాజిక సమీకరణాలకు సరిగ్గా సరిపోయే వ్యక్తినే ఎంపిక చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దీంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొనగా, పాత మంత్రుల్లో ఎవరిపై వేటు పడుతుందనే భయం కనిపిస్తోంది. ఈ మంత్రివర్గ విస్తరణ లేదా మార్పులు మే రెండో వారం తర్వాతే ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ లోపు పార్టీలో అసమ్మతి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పదవి దక్కని నేతలను బుజ్జగించడానికి నామినేటెడ్ పదవుల ఆశ చూపుతున్నారు. గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అదే సమయంలో భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొగల సమర్థులను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఏఐసీసీ సూచిస్తోంది. అటు ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడం, ఇటు రాజకీయంగా బలోపేతం కావడం అనే రెండు లక్ష్యాలతో ఈ కూర్పు జరుగుతోంది. ఢిల్లీ పర్యటనలో ఈ పేర్లపై ముద్ర పడగానే ఉత్తర్వులు వెలువడనున్నాయి. మంత్రి పదవుల భర్తీలో జిల్లాల వారీ ప్రాతినిధ్యం కూడా ఒక ప్రధాన అంశంగా మారింది. కొన్ని ఉమ్మడి జిల్లాలకు అసలు ప్రాతినిధ్యమే లేకపోవడంపై అక్కడి నేతలు గుర్రుగా ఉన్నారు. కొత్తగా తీసుకునే ఇద్దరు మంత్రుల ద్వారా ఆ లోటును భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సామాజిక వర్గం ఒకటైతే, ఆ ప్రాంతం మరొకటి కావడంతో ఎంపిక ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ మధ్య బ్యాలెన్స్ ఉండేలా చూస్తున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా అన్ని కోణాల నుంచి పరిశీలిస్తున్నారు. అధిష్ఠానం వద్ద కూడా ఆయన తన వాదనను బలంగా వినిపించే అవకాశం ఉంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తున్నాయి. మరోవైపు, లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతల్లో పోటీ తీవ్రంగా ఉంది. బాలు నాయక్ తనకు అవకాశం దక్కకపోతే మౌనంగా ఉండటమే మేలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ స్పీకర్ వంటి పదవుల కంటే మంత్రి పదవి ద్వారానే ప్రజలకు సేవ చేయాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. అటు రామచంద్రు నాయక్ కూడా సానుకూల సంకేతాల కోసం వేచి చూస్తున్నారు. ఈ ఇద్దరిలో ఎవరికి అదృష్టం వరిస్తుందో తెలియదు గానీ, ఒకరికి మాత్రం నిరాశ తప్పదని అర్థమవుతోంది. వీరి మధ్య సమన్వయం కుదర్చడం కూడా పార్టీకి పెద్ద సవాలుగా మారింది. ఏదేమైనా గిరిజన కోటాలో ఒక బెర్తు ఖాయం కావడంతో ఆ వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# కేటీఆర్ ఓ 420

**మొదటిపేజీ తరువాయి**

ప్రతి చోటా ఆ కుటుంబం హస్తం ఉందనేది జగమెరిగిన సత్యమని ధ్వజమెత్తారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేటీఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రంలోని విలువైన వనరులను దోచుకున్నారని, అందుకే ఇప్పుడు ప్రజలు వారిని తిరస్కరించినా బుద్ధి రావడం లేదని ఎద్దేవా చేశారు. దొంగల ముఠాకు నాయకత్వం వహిస్తున్న కేటీఆర్, ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. కేటీఆర్ స్థాయిని ప్రశ్నిస్తూ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ నాయకుడు రాహుల్ గాంధీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదని స్పష్టం చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో కేటీఆర్ ఎక్కడున్నారో అందరికీ తెలుసన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న వేళ దొంగచాటుగా వచ్చి చేరిన కేటీఆర్, ఉద్యమకారుడు కేకే మహేందర్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు. స్వార్థ రాజకీయాల కోసం నమ్ముకున్న వారి గొంతు కోయడం ఆ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ఉద్యమ ముసుగులో పదవులు అనుభవించిన వారే ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యువత భవిష్యత్తుతో ఆడుకుందని పీసీసీ అధ్యక్షుడు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సింది పోయి, యువతను మద్యానికి బానిసలుగా మార్చిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా గల్లీ గల్లీలో బెల్ట్ షాపులు పెంచి రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. విద్యావంతులైన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమై, వారిని నిరుద్యోగులుగా మిగిల్చారని విమర్శించారు. కేటీఆర్ మరియు ఆయన తండ్రి అనుసరించిన తప్పుడు విధానాల వల్ల తెలంగాణ నేడు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆయన వివరించారు. కుటుంబ పాలనపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ గట్టిగా నిలదీశారు. ఒకే కుటుంబానికి చెందిన వారికి ఇన్ని పదవులు ఏ ప్రాతిపదికన ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎందరో నాయకులు ఉన్నప్పటికీ, కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులకే ప్రాధాన్యత దక్కడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, లేదంటే తల నరుక్కుంటానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్, ఆ మాటను నిలబెట్టుకోలేకపోయారని గుర్తు చేశారు. ఇప్పుడు కేసీఆర్‌కు తల ఉందా లేదా అని సూటిగా ప్రశ్నించారు. మాట తప్పడం మడమ తిప్పడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందని, వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఆగడాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. అధికార మదంతో ఆ పార్టీ నాయకులు సామాన్యులను వేధించిన తీరు ఇప్పటికీ అందరి కళ్ల ముందు కదలాడుతోందన్నారు. కేటీఆర్ ప్రస్తుతం చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే ఆయన స్పృహలో ఉన్నారా లేదా అనే అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల ప్రభావంతోనే ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి భాష వాడటం తగదని హితవు పలికారు. అహంకారంతో విర్రవీగితే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మరోవైపు బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పై కూడా మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బండి సంజయ్ ఒక పిట్టల దొరలా మారిపోయారని, కేవలం మాటలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉండి కూడా తెలంగాణకు ఒక్క మేలు చేయలేదని మండిపడ్డారు. అవినీతిపై విచారణ జరిపించాలని, సీబీఐకి కేసు అప్పగిస్తే ఏదో పొడిచేస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ నేతలు, గత ఆరు నెలలుగా ఏం చేస్తున్నారని



నిలదీశారు. కేవలం సోషల్ మీడియాలో హడావుడి చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో వారు సాధించింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు. బీజేపీ మరియు బీఆర్ఎస్ పార్టీలు లోపాయకారీ ఒప్పందంతో పని చేస్తున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నట్లు కనిపిస్తున్నా, లోలోపల మాత్రం ఒక్కటేనని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్న ఈ రెండు పార్టీలను ప్రజలు ఖచ్చితంగా తిరస్కరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు చేసిన వాగ్దానాలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. కేవలం మతపరమైన అంశాలను వాడుకుంటూ పబ్బం గడుపుకోవడం తప్ప, ప్రజల కష్టాలను తీర్చడంలో ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. గత ప్రభుత్వ అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని కొనియాడారు. విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, అభివృద్ధి పనులను ఆపలేవని స్పష్టం చేశారు. పాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అందులో భాగంగానే అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోవడం ఖాయమని పీసీసీ చీఫ్ జోస్యం చెప్పారు. ప్రజలు ఆ పార్టీ నాయకులను గ్రామాల్లోకి రానివ్వడం లేదని, వారి వైఫల్యాలే వారిని పతనం దిశగా నడిపిస్తున్నాయని అన్నారు. కేటీఆర్ తన తీరు మార్చుకోకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విమర్శలు చేసే ముందు తమ గతాన్ని ఒక్కసారి చూసుకోవాలని హితవు పలికారు. ప్రజల కోసం పనిచేసే నాయకులను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ట్విట్టర్ లోకానికే పరిమితమవ్వాలని ఎద్దేవా చేశారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ బలం ఏంటో త్వరలోనే చూపిస్తామన్నారు. ముగింపులో భాగంగా, రాష్ట్ర ప్రజలందరూ కాంగ్రెస్ వెంటే ఉన్నారని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేటీఆర్, బండి సంజయ్ వంటి నాయకుల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని, వారు కేవలం రాజకీయ ఉనికి కోసమే ఇలాంటి నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. నిబద్ధతతో పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, అక్రమార్కుల ఆట కట్టించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రకటించిన సర్కార్

**మొదటిపేజీ తరువాయి**

ద్వారా సామాజిక సమతుల్యతను పాటించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్ నియమితులవ్వగా, మున్నూరు కాపు కార్పొరేషన్ బాధ్యతలను బొమ్మ శ్రీరాం చక్రవర్తికి అప్పగించారు. వెలమ కార్పొరేషన్ సారథిగా జువ్వాడి నర్సింగ్ రావు, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బండి రమేశ్ ఎంపికయ్యారు. అగ్రవర్ణాలతో పాటు వెనుకబడిన తరగతులకు కూడా సముచిత స్థానం కల్పిస్తూ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఈ నియామకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడటమే కాకుండా, పార్టీ పట్ల విధేయతగా ఉన్న వారికి గుర్తింపు లభించిందనే భావన కేడర్‌లో వ్యక్తమవుతోంది. బీసీ కుల వృత్తులపై ఆధారపడిన వర్గాలకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. కల్లు గీత కార్పొరేషన్ బాధ్యతలను మోత్కూరి చంద్రశేఖర్ గౌడ్‌కు, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్‌గా గూడూరి శ్రీనివాస్‌కు అవకాశం కల్పించారు. నేతన్నల సంక్షేమం కోసం పనిచేసే హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రొఫెసర్ వెంకటరమణను నియమించడం ద్వారా విద్యావేత్తల సేవలను కూడా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్‌గా గుంజ రేణుకను ఎంపిక చేయడం ద్వారా మహిళా ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఇలా కుల వృత్తుల వారీగా ప్రత్యేక కార్పొరేషన్లను బలోపేతం చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ప్రభుత్వానికి లభిస్తుంది. విద్య మరియు సాంస్కృతిక రంగాల్లో కీలకమైన తెలుగు అకాడమీ బాధ్యతలను వెంకట రమణకు అప్పగించారు. రాష్ట్ర భాషా వికాసం, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించే ఈ సంస్థకు సమర్థుడైన వ్యక్తిని నియమించడం ద్వారా అకాడమీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని ఆశిస్తున్నారు. అలాగే వాషర్ మెన్ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా డాక్టర్ దాసిరాజు అజయ్ కుమార్ నియమితులయ్యారు. విద్యావంతులకు ప్రాధాన్యత ఇస్తూనే, సామాజిక సేవా దృక్పథం కలిగిన వారిని ఎంపిక చేయడం ద్వారా పాలనలో కొత్తదనం తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నామినేటెడ్ పదవుల భర్తీలో మేధావులకు చోటు కల్పించడం పార్టీలో నూతనోత్తేజానికి కారణమవుతోంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పశుపోషణ మరియు వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా కొల్లే సరితను, పశుగణ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా చరణ్ కౌశిక్ యాదవ్‌ను నియమించారు. యాదవ కార్పొరేషన్ సారథిగా రఘునాథ్ యాదవ్‌కు అవకాశం ఇచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ




కార్పొరేషన్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నియామకాల ద్వారా గొర్రె కాపరులు మరియు పాడి రైతుల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక వేదిక ఏర్పడింది. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పారదర్శక నిబంధనలతో అందేలా చూడటం వీరి ప్రధాన విధిగా ఉండనుంది. ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన కార్పొరేషన్లలో కూడా భర్తీ ప్రక్రియ పూర్తి చేశారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ ఛైర్మన్‌గా గట్టు తిమ్మప్ప, భట్టరాజు కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా బాల్‌రాజ్ నియమితులయ్యారు. పెరిక కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా డొంగరి వెంకటేశ్వర్లు, మేర కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సంగా వెంకటరాజం బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నో ఏళ్లుగా విస్మరణకు గురైన చిన్న కులాలకు సైతం కార్పొరేషన్ పదవుల్లో వాటా దక్కడం పట్ల ఆయా సామాజిక వర్గాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను స్పష్టంగా ప్రకటిస్తూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని ఈ చర్యల ద్వారా నిరూపించుకుంది. ఛైర్మన్ పదవులతో పాటు కార్పొరేషన్లకు వైస్ ఛైర్మన్లను కూడా ప్రభుత్వం నియమించింది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు వైస్ ఛైర్మన్‌గా పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్, వాషర్మన్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా బంగారు బాబు ఎంపికయ్యారు. కల్లు గీత కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా కేసం నాగరాజు గౌడ్, పెరిక కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా బుడగం శ్రీనివాస్ నియమితులయ్యారు. మేర కార్పొరేషన్ బాధ్యతల్లో ఎం. లక్ష్మీ నారాయణను భాగస్వామిని చేశారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా బోయ నాగేశ్, మున్నూరు కాపు కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా అల్లం భాస్కర్‌ను నియమించారు. ఈ నియామకాలు పాలనలో మరింత చురుకైన భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయి. యాదవ మరియు వడ్డెర కార్పొరేషన్లకు కూడా వైస్ ఛైర్మన్లను ఖరారు చేశారు. యాదవ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా గజ్జి భాస్కర్ యాదవ్, వడ్డెర కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా బత్తుల వెంకటేశ్ నియామకం పొందారు. తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్‌పర్సన్‌గా జక్కని అనీతకు అవకాశం ఇచ్చారు. కమ్మ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా పరుచూరి మురళిని నియమించారు. ఇలా ద్వితీయ శ్రేణి నేతలకు కూడా ఉన్నత పదవులు దక్కడం ద్వారా పార్టీ పట్ల వారికున్న నమ్మకం బలపడుతుంది. కార్పొరేషన్ల నిర్వహణలో వైస్ ఛైర్మన్లు కీలక పాత్ర పోషిస్తూ, చైర్మన్లకు అండగా ఉండి సామాజిక లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేస్తారు. ఈ నియామకాల వెనుక ఒక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉంది. గత పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉండి, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పార్టీని నమ్ముకున్న వారికి ఇప్పుడు న్యాయం జరిగిందని గాంధీ భవన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రతి సామాజిక వర్గానికి చెందిన అగ్ర నేతలకు పదవులు ఇవ్వడం ద్వారా ఆయా వర్గాల ఓటు బ్యాంకును పదిలం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ వర్గాల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశంగా ప్రభుత్వం భావించింది. ఈ నియామకాలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి సానుకూల ఫలితాలను ఇస్తాయని ఆశిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ ఇక్కడితో ఆగడం లేదు. త్వరలోనే రెండో విడత నియామకాలు కూడా ఉండబోతున్నాయని, మిగిలిన కార్పొరేషన్లకు మరియు జిల్లా స్థాయి పదవులకు పేర్లను దాదాపు ఖరారు చేశారని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాల వారీగా సమీకరణాలను లెక్కలోకి తీసుకుంటూ, ఎవరికీ అసంతృప్తి కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పదవులు ఆశించి భంగపడ్డ నేతలను బుజ్జగించే పనిలో పీసీసీ అగ్ర నాయకత్వం నిమగ్నమైంది. త్వరలోనే మరికొంత మంది సీనియర్ నేతలకు ప్రభుత్వ సలహాదారులుగా లేదా ఇతర బోర్డుల ఛైర్మన్లుగా అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో తెలంగాణలో రాజకీయ కోలాహలం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తానికి కాంగ్రెస్ సర్కారు చేపట్టిన ఈ పదవుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.

## డీసీసీబీ డైరెక్టర్‌కు ఘన సన్మానం



**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా వెంకంపాడ్ గ్రామంలో డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరి రెడ్డి గారిని గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సర్పంచ్ ఉప్పల సోమన్న మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి సహకార పరపతి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆ దిశగా చాపల యాదగిరి రెడ్డి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరి రెడ్డి మాట్లాడుతూ తనపై చూపిన ఆదరణకు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తానని, సహకార బ్యాంకుల ద్వారా రైతులకు మరింత సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు,వెంకంపాడు గ్రామస్థులు పాల్గొన్నారు.

## నర్సులను సన్మానం



**విశాలభారతి, గూడూరు:** గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నర్సులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య హాజరై నర్సులను సన్మానించడం జరిగింది అనంతరం పర్నాంది రామయ్య మాట్లాడుతూ డాక్టర్లు నర్సులు అంటే రోగులకు మందులు ఇవ్వడం మాత్రమే కాదు వారికి మనోధైర్యం ఇస్తూ ఎలాంటి పరిస్థితులైన ఎప్పుడు అవసరమైన సేవలో ముందు ఉంటూ బాధలో ఉన్న వారికి ఒక చిన్న నవ్వు ఓ మాటతోనే ఆశ నింపగలరు. రోగుల ప్రాణాలను కాపాడే నిజమైన దేవుళ్ళు నర్సులు అన్నారు. సావిత్రిబాయి పూలే ఆరోజు స్త్రీలకు విద్యను అందించడం వల్ల ఈరోజు మహిళలు ప్రజాసేవ చేస్తున్నారు అన్నారు. సంబంధం లేని వ్యక్తుల ప్రాణాలు కాపాడే మాతృమూర్తులు డాక్టర్లు, నర్సులు. కుల ,మత ,రహిత సేవలందిస్తున్న ప్రాణదాతలు నర్సులని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిరంజీవి డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సన్మాన గ్రహీతలు బి ఇందిరా హెడ్ నర్స్, సుజయ స్టాఫ్ నర్స్, ఎండి సమీనా, చంద్రకళ, ఎం అనురాధ, మాధవి, సామాజిక అధ్యయన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ళ వెంకన్న, సంజీవ ,తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణుల భారీ తరలింపు

**గుడిపూడి నవీన్‌రావు ఆధ్వర్యంలో ఉత్సాహంగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు**



**డోర్నకల్ విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వరంగల్‌లో జరుగుతున్న రైతు సంగ్రామ సభకు తరలివెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వాహనాల్లో, ద్విచక్ర వాహనాల్లో గులాబీ జెండాలతో ఉత్సాహంగా బయలుదేరిన పార్టీ శ్రేణులు రైతాంగానికి తమ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని చాటిచెప్పారు. మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు ఆధ్వర్యంలో బయలుదేరిన ఈ ర్యాలీలో యువ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వరంగల్ రైతు సభ రైతుల గొంతుకగా మారబోతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వారు విమర్శించారు.రైతు రుణమాఫీ, రైతుబంధు, ధాన్యం కొనుగోలు, ఎరువుల కొరత, సాగునీటి సమస్యలు, మద్దతు ధరల అంశాలపై బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా పోరాటానికి శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే వరంగల్ రైతు సంగ్రామ సభకు మరిపెడ నుంచి భారీ స్పందన లభించిందన్నారు.రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుంది.. రైతు కన్నీరు తుడిచేది గులాబీ జెండానే" అంటూ నాయకులు నినాదాలు చేస్తూ సభకు బయలుదేరారు. మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణుల ఐక్యత మరోసారి స్పష్టమైందని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

## కృత్రిమ మేధస్సు కేంద్రం టాస్క్ ప్రతిభా ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ




**విశాలభారతి, మంథని:** గ్రామీణ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో మంథనిలో టాస్క్-ఏవీజీసీ & కృత్రిమ మేధస్సు కేంద్రం, టాస్క్-సీట్రిఎల్ఎస్ ప్రతిభా కేంద్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి పాల్గొని కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు అనిమేషన్, దృశ్య ప్రభావాలు, గేమింగ్, కామిక్స్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక రంగాల్లో శిక్షణ పొందితే యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు సిద్ధమవుతాయని తెలిపారు. గ్రామీణ విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే వేదికగా ఈ కేంద్రాలు నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి క్ట్రర్ల్స్ డాటా సెంటర్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా కేంద్రం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందుతుందని వివరించారు. డిజిటల్ ప్రపంచానికి గ్రామీణ యువతను దగ్గర చేయడమే ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఇప్పటివరకు కృత్రిమ మేధస్సు వంటి కోర్సుల కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా మంథనిలోనే ఈ అవకాశాలు అందుబాటులోకి రావడం ఆనందకరమని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఆలోచనతో ఈ కేంద్రాన్ని మంథనిలో ఏర్పాటు చేయడం ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. యువత, విద్యార్థులు ఈ టాస్క్ కేంద్రాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సాంకేతిక కేంద్రాల ఏర్పాటు మంథని ప్రాంతానికి మైలురాయిగా నిలిచింది.

## నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.. అకాల వర్షంతో తడిసిన ప్రతి గింజను కొనుకోలు చేస్తాం**



**విశాలభారతి అంతర్గం:** రామగుండం నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోవడంతో బుధవారం పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అంతర్గాం మండలంలోని అంతర్గాం టి టి ఎస్, పొట్యాల, మద్దిర్యాల, సోమనపల్లి, బ్రాహ్మణపల్లి, కుక్కల గూడూరు గ్రామాల్లో పర్యటించి సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, తడిచిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు నమోదు చేసి, రైతులకు తగిన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి నష్టాన్ని తగ్గించే చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్

- **చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు–గోరక్షణ పేరుతో హింసకు పాల్పడవద్దు.పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**విశాలభారతి, గోదావరిఖని;**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం,వ్యక్తిగత దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ (వీహెచ్‌పీ యువజన విభాగం),రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, హిందూవాహిని, శ్రీరామ్ సేన,హిందూ యువవాహిని సభ్యులతో పశువుల అక్రమ రవాణా నిరోధంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో చట్టపరమైన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పోలీస్ శాఖ చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 08 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గూడెం చెక్‌పోస్ట్ - ఎన్‌హెచ్63 రోడ్‌పై. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంద్రన్‌పల్లి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్ట్. కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రాపన్‌పల్లి చెక్‌పోస్ట్. జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంద్రారం చెక్‌పోస్ట్ (మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల సరిహద్దు). తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రేపల్లెవాడ చెక్‌పోస్ట్.బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బసంత్‌నగర్ టోల్‌గేట్ చెక్‌పోస్ట్. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దుబ్బపల్లి చెక్‌పోస్ట్. సుల్తానాబాద్, గుంపుల ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు.పశువులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, ఇది మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వం మరియు సుప్రీంకోర్టుi మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్,కౌ స్లాటర్ యాక్ట్,భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు. గోరక్షకుల పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే రామగుండం పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలందరూ ప్రశాంతంగా జీవించేలా,సామాజిక సామరస్యాన్ని కాపాడేలా, మూగజీవాల రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, తాండూర్ సీఐ దేవయ్య,ఆర్ఐ పెద్దన్న,రమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

## వస్తావా.. రేటెంత? ' అని అడిగిన పోకిరీలు



**కట్ చేస్తే..! .. మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్**

**ఎల్బీనగర్ విశాలభారతి:**



మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు చేపట్టిన సుమతి ఐపీఎస్ మహిళల భద్రతను పరీక్షించేందుకు అర్ధరాత్రి దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో సామాన్య మహిళగా మారి సీక్రెట్ ఆపరేషన్ నిర్వహించారు. ఏ సెక్యూరిటీ లేకుండా ఒంటరిగా నిల్చున్న ఆమెను 40 మంది పోకిరీలు చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించగా.. మూడు గంటల పాటు పెట్రోలింగ్ పోలీసులు అటువైపు రాకపోవడం గమనార్హం. చివరకు పోకిరీలందరినీ అదుపులోకి తీసుకున్న ఆమె.. గంజాయి మత్తులో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.హైదరాబాద్ నగరంలో అర్ధరాత్రి వేళ ఒంటరి మహిళ కనిపిస్తే చాలు 'వస్తావా.. రేటెంత?' అంటూ కామపిశాచుల నుంచి జుగుప్సాకరమైన ప్రశ్నలు. ఈ పోకిరీల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఈ అరాచకానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్..సాధారణ మహిళగా మారి అర్ధరాత్రి రంగంలోకి దిగారు. ఆమె చేపట్టిన సీక్రెట్ ఆపరేషన్ ఇప్పుడు పోకిరీల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. దిలుసుఖ్‌నగర్ ప్రాంతంలో మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో.. ఆమె ఎవరూ ఊహించని రీతిలో ఒక సాహసోపేతమైన ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు.ఇటీవల ఆమె మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు స్వీకరించగా.. ఆ తర్వాతి రోజే అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎలాంటి భద్రతా సిబ్బంది లేకుండా సాదాసీదా దుస్తుల్లో ఒక సామాన్య మహిళలా దిలుసుఖ్ నగర్ బస్టాండ్‌కు వద్దకు చేరుకున్నారు. అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికురాలిలా నిల్చున్నారు. కమిషనర్ అని తెలియని దాదాపు 40 మంది పోకిరీలు ఆమెను చుట్టుముట్టారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆమెపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ.. 'వస్తావా.. రేటెంత?' అంటూ దారుణంగా వేధించారు. అర్ధరాత్రి 12 నుండి తెల్లవారుజామున 3 వరకు సుమారు మూడు గంటల పాటు ఆమె ఆ నరకాన్ని మౌనంగా భరిస్తూనే అక్కడి పరిస్థితులను గమనించారుక్రమంలో పోలీసుల వైఫల్యం కూడా బట్టబయలైంది. మూడు గంటల పాటు ఆ పరిసరాల్లో ఒక్క పెట్రోలింగ్ వాహనం కూడా కనిపించలేదు. చివరకు తెల్లవారుజామున 3:30 గంటలకు ఒక బీట్ కానిస్టేబుల్ అటువైపు వచ్చారు. వరుసగా మూడు రోజుల పాటు ఇదే తరహాలో నిఘా పెట్టిన సుమతి.. మొత్తం 40 మంది పోకిరీలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అత్యధికంగా హాస్టల్స్‌లో ఉంటూ చదువుకోవాల్సిన విద్యార్థులే ఉండటం గమనార్హం.మొత్తం దాదాపు 40 మంది పోకిరీలను పోలీసులు అదుపులోకి తీసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, మద్యం-గంజాయి అలవాట్లు, రోడ్లపై అసభ్య ప్రవర్తనపై గట్టి హెచ్చరిక చేశారు.

## జర్నలిస్టులపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**సీనియర్ జర్నలిస్ట్ లు కొప్పుల సతీష్, అసోసియేషన్ నాయకులు గండమాల రామకృష్ణ హెచ్చరిక**

**కురవి విశాలభారతి:**

కాంగ్రెస్ నాయకులు డా. వీరన్న నాయక్ బీజేపీ నేతతో సెల్ఫీ దిగడం, పూజలో పాల్గొనడంపై పత్రికలో వచ్చిన కథనానికి ఎందుకు పాల్గొనాల్సి వచ్చింది? ప్రభుత్వ విప్ కు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఏం సమాధానం చెప్తారు? నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిశారా? వినతిపత్రం ఇవ్వడానికి కలిశారా? బిజెపిలో చేరడానికా ఆంతర్యం ఏమిటి? ఎందుకు పాల్గొన్నారో స్వంత పార్టీకి సమాధానం చెప్పాల్సిన వీరన్న నాయక్ తమ తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం "జనం వాయిస్" ఇపేపర్ అంటూ ..,సీనియర్ జర్నలిస్ట్, జిల్లా ప్రతినిధి బేతమల్ల సహాదేవ్ గారిపై కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వీరన్న నాయక్ సోషల్ మీడియాలో చేసిన అనుచిత వ్యాఖ్యలను, తప్పుడు ఆరోపణలను డోర్నకల్ సీనియర్ జర్నలిస్ట్, అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. బుధవారం ఈ మేరకు సీనియర్ జర్నలిస్ట్ కొప్పుల సతీష్, తెలంగాణ మాల జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి గండమాల రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం తప్పులను ఎత్తి చూపడం జర్నలిస్టుల బాధ్యత అని, దాన్ని తట్టుకోలేక వ్యక్తిగత దూషణలకు దిగడం వీరన్న నాయక్ అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజకీయాల్లో పార్టీలు వేరైనా, ప్రజా అవసరాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిని కలవడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, దాన్ని అపహాస్యం చేస్తూ మాట్లాడటం సరికాదన్నారు. ముఖ్యంగా, సహాదేవ్ డబ్బులు అడిగారని వీరన్న నాయక్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమని, తన తప్పును కప్పిపుచ్చుకోవడానికే జర్నలిస్టుల వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారని ధ్వజమెత్తారు."డబ్బులు శాశ్వతం కాదు, విలువలే శాశ్వతం" అని నీతులు చెబుతున్న నాయకులు, ముందు జర్నలిస్టుల పట్ల గౌరవంగా మెలగడం నేర్చుకోవాలని హితవు పలికారు.

**అసోసియేషన్ డిమాండ్లు:**

సహాదేవ్ పై చేసిన ఆరోపణలను వీరన్న నాయక్ వెంటనే నిరూపించాలి, లేదంటే బహిరంగంగా



క్షమాపణ చెప్పాలి. జర్నలిస్టుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. క్షమాపణ చెప్పని పక్షంలో వీరన్న నాయక్ తీరుకు నిరసనగా త్వరలోనే భారీ ఎత్తున 'దీక్ష' చేపడతామని, పరువు నష్టం దావా కూడా వేస్తామని హెచ్చరించారు. మీడియాపై ఉన్న గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని, ఇలాంటి బెదిరింపులకు జర్నలిస్టులు భయపడబోరని సీనియర్ జర్నలిస్ట్ కొప్పుల సతీష్, గండమాల రామకృష్ణ స్పష్టం చేశారు.

## నూతన డిజిపి సీవి ఆనంద్ కు శుభాకాంక్షలు

**ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఈరెంటి విజయ్ మాదిగ**



**దేవరుప్పుల, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ గారిని ఎమ్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఈరెంటి విజయ్ మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఈరెంటి విజయ్ మాదిగ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయాలని, నేరాల నియంత్రణలో కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు భద్రత కల్పించాలని, కోరారు అదే విధంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు వ్యవస్థను మరింత సమర్థవంతంగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని, సూచించారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పోలీసులు సేవలందించాలని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా దృష్టి సారించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నూతన డిజిపి సివి ఆనంద్ గారు తన పదవీకాలంలో ప్రజల ఆశలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.

## రైతులు వ్యవసాయ సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య: వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం రైతుల ఉపయోగార్థం మార్కెట్ ద్వారా రైతులకు తార్పలిన్స్, ఎలక్ట్రానిక్ కాంటలు, ఆటోమేటిక్ ఒడ్లు పట్టే యంత్రాలు,మ్యాచర్ మీటర్స్ అందుబాటులో ఉన్నాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మార్కెటింగ్ శాఖ ప్రాముఖ్యత నివేదిక రైతుబంధు రైతు బీమా వ్యవసాయ ఉద్యానవన శాఖ వారిచే ఇతర వాణిజ్య పంటల మార్పిడి ఆయిల్ ఫామ్ సాగు గురించి రైతులకు అవగాహన కల్పించనైనదని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం ఆదర్శ రైతులకు శాలువాతో సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ ముగుదాల పావని రమేష్ గౌడ్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చెనగోని అంజయ్య, ఏడిఏ వెంకటేశ్వర్లు, ఎంఈఓ నాగరాజు, ఆర్ఐ సుధాకర్ రావు, కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ భాగ్యశ్రీ, కోపరేటివ్ సొసైటీ అధికారి సురేష్, ఏఈఓ శ్రావ్య, మార్కెట్ కమిటీ గౌరవ సభ్యులు ఢిల్లీ చంద్రకళ, డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లు చింతల ఉమామహేశ్వరి సాయిలు, మార్కెట్ కమిటీ కార్యదర్శి వీ రవీందర్ రెడ్డి, ఏపీఎం యాదయ్య మరియు రైతులు అమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ మందిర పునర్నిర్మాణ కార్యక్రమం

**విగ్రహ, గజస్తంభ ప్రతిష్టలో ప్రజాప్రతినిధులు**



**విశాలభారతి,అబ్దుల్లాపూర్ మెట్ :** ఆర్టీసీ సూపర్వైజర్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ డివిజన్‌లో నిర్వహించిన హనుమాన్ మందిర పునర్నిర్మాణం, హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ, గజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనతో కలిసి కార్యక్రమానికి హాజరైన నాయకులు ఈ వేడుకను విజయవంతం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. మాజీ కార్పొరేటర్ విటల్ రెడ్డి, యువ నాయకుడు శ్రీనాథ్ కూడా పాల్గొని కార్యక్రమానికి శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులకు పాల్గొన్న నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగౌని శ్రీధర్ గౌడ్‌తో పాటు స్థానిక కాలనీ ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాలువ కబ్జాపై ఆగ్రహం అధికారులకు స్థానికుల ఫిర్యాదు

**సహజ సిద్ధంగా పుట్టిన కాలువ పూడ్చివేతతో ముంపు ప్రమాదం**

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలంలోని కనకమామిడి రెవెన్యూ పరిధిలో సహజ సిద్ధంగా ఉన్న కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేస్తూ కబ్జా చేస్తున్నారనే ఆరోపణలతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగమేశ్వర దేవాలయం సమీపం నుంచి ప్రవహిస్తున్న ఈ కాలువను అక్రమంగా ఆక్రమించి, భూసమీకరణ పేరుతో మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ గౌతమ్ కుమార్, శంకర్‌పల్లి ఇరిగేషన్ డీఈi చంద్రకాంత్‌కు వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు.స్థానికుల ఆరోపణల ప్రకారం, ఎన్నో సంవత్సరాలుగా సహజంగా ప్రవహిస్తున్న కాలువను పూడ్చివేయడం వల్ల వర్షాకాలంలో వరదనీరు దారిమళ్లి సమీప కాలనీలు, వ్యవసాయ భూములు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఇప్పటికే సంగమేశ్వర దేవాలయం పరిసర ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, కాలువ ఆక్రమణలు పెరుగుతున్నాయని తెలిపారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి కాలువను యథాతథంగా పునరుద్ధరించాలని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాలువలను కాపాడకపోతే రేపు గ్రామాలు ముంపులో మునిగే ప్రమాదం ఉంది అని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



# బోథ్ రాజకీయాల్లో మళ్లీ చక్రం తిప్పుతున్న మాజీ ఎమ్మెల్యే

- తెలంగాణ రక్షణ సేన పార్టీతో ప్రజల్లోకి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు
- ఉద్యమకారుడిగా గుర్తింపు... అభివృద్ధి పనులతో ఇప్పటికీ ప్రజాదరణ



**ఆదిలాబాద్, విశాలభారతి:**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మరోసారి చర్చనీయాంశంగా మారారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన, ప్రస్తుతం తెలంగాణ రక్షణ సేన పార్టీ తరఫున ప్రజల్లో చురుకుగా పర్యటిస్తూ రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అవుతున్నారు.

**దశాబ్దకాల సేవలు – ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు**

దాదాపు పదేళ్ల పాటు బోథ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించిన రాథోడ్ బాపురావు, తన హయాంలో గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, విద్యా సంస్థల అభివృద్ధి, రైతు సంక్షేమం వంటి అనేక రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల మన్ననలు పొందారు.

**తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ సమయంలో రాథోడ్ బాపురావు చురుకైన పాత్ర పోషించారు. ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ఉద్యమకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కూడా ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

**గ్రామాల్లో పర్యటనలకు ఘన స్వాగతం**

ఇటీవల బోథ్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించిన రాథోడ్ బాపురావుకు కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన పార్టీ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**యువత, రైతులు, గిరిజన హక్కులపై ఫోకస్**

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులకు మద్దతు ధరలు అందించడం, గిరిజన హక్కుల పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు రాథోడ్ బాపురావు వెల్లడించారు.

**బోథ్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలా?**

రాథోడ్ బాపురావు మళ్లీ రాజకీయంగా చురుకుగా మారడం బోథ్ నియోజకవర్గ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తున్న ఆయన, రాబోయే రోజుల్లో కీలక రాజకీయ పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**"ప్రజల ఆశీర్వాదంతో మరింత సేవ"**

"బోథ్ ప్రజల అభివృద్ధే నా ధ్యేయం. ప్రజల ఆశీర్వాదంతో మరింత సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను" అని రాథోడ్ బాపురావు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారాయి.

## పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి

**తెలంగాణ జాగృతి డిమాండ్**



**మొయినాబాద్, విశాలభారతి:** పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు కె. శివశంకర్ మాట్లాడుతూ, 2014లో మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అప్పటి ఎన్‌డీఏ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే, 12 సంవత్సరాలు గడిచినా ఆ హామీ అమలు దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించినప్పటికీ, ఈ కీలక అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని ఆయన తెలిపారు. ఈ నెల 10న వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు రానున్న నేపథ్యంలో, ముందుగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని, ఆ తర్వాతే తెలంగాణ గడ్డపై అడుగు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. మొయినాబాద్ మండల అధ్యక్షుడు సంగారి నాగేశ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, రైతుల అభివృద్ధికి ఇది ఎంతో కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు.

## పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలి

**హామీ నిలబెట్టిన తర్వాతే మోదీ తెలంగాణకు రావాలి – కప్పాటి పాండురంగారెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించిన తర్వాతే ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ గడ్డపై అడుగుపెట్టాలని తెలంగాణ రక్షణ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల ప్రచారంలో మహబూబ్‌నగర్‌లో జరిగిన సభలో ఎన్డీయే ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే 12 ఏళ్లు గడిచినా ఆ హామీని అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించి పార్లమెంట్‌కు పంపినా, ఈ ప్రాజెక్టు విషయమై కేంద్రం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. దక్షిణ తెలంగాణలో వ్యవసాయంపై ఆధారపడిన రైతాంగాన్ని ఇది తీవ్రంగా నిరాశపరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 10న వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్రానికి రానున్న ప్రధాని ముందుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ ప్రకటన చేసిన తర్వాతే తెలంగాణకు రావాలని స్పష్టం చేశారు. నీటి పారుదల సదుపాయాల లేమితో ఇబ్బందులు పడుతున్న రైతుల ప్రయోజనాలను విస్మరిస్తే తెలంగాణ సమాజం సహించదని కప్పాటి పాండురంగారెడ్డి హెచ్చరించారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో బుధవారం నిర్వహించిన పలు వివాహ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన శుభకార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివాహ బంధం రెండు కుటుంబాలను కలిపే పవిత్రమైన బంధమని పేర్కొన్నారు. వధూవరులు సుఖశాంతులతో, ఆనందంగా జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు.

## ఘనంగా ఉప్పల శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు




**రాజేంద్రనగర్, విశాలభారతి :** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఐవీఎఫ్ సెంట్రల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, మాజీ ఛైర్మన్ తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్, ఆపద్బాంధవుడు, పేదల పెన్నిధి అయిన శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా గారి 54వ పుట్టినరోజు సందర్భంగా బండ్లగూడ జోన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం బండ్లగూడ జాగీరు సభ్యుల ఆధ్వర్యంలో చలివేంద్రం వద్ద కేక్ కట్ చేసి, ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్ సుంకు లక్ష్మీనారాయణ, గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్స్ రావికంటి వినయ్ కుమార్, రామ్మోహన్ దరిశ, జాయింట్ ట్రెసరర్ వినోద్ కుమార్ కొక్కుళ్ళ, యూత్ వైస్ ప్రెసిడెంట్ అమరవాది నరేష్‌కుమార్, కిస్మత్పూర్ డివిజన్ ట్రెసరర్ కట్కూరి వీరేశం, గంధంగూడ ప్రెసిడెంట్ ఆంజనేయ ప్రసాద్, EC మెంబర్ ఆలంపల్లి సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శ్రీనివాస్ గుప్తాకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజా పాలన కార్యక్రమంలో రైతులకు అవగాహన – ఉత్తమ రైతులకు సత్కారం

**రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది – చిలుక మధుసూదన్ రెడ్డి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఉదయం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో రైతు వారం సందర్భంగా అవగాహన కార్యక్రమం i నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు చేసింది. అనంతరం ఉత్తమ పండ్ల రైతులను గుర్తించి పాలకవర్గం అభినందించింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైతు సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తున్న ప్రభుత్వానికి రైతుల మద్దతు ఉందన్నారు. సన్నవడ్లకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి ఆదుకున్నదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతు భరోసా పథకం ద్వారా విడతల వారీగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. రైతు అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర చారి, సభ్యులు బండి మధుసూదన్ రావు, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, నర్సింహా, అంజయ్య, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది మరియు మార్కెట్‌కు వచ్చే రైతులు పాల్గొన్నారు.




## అబ్దుల్లాపూర్ మెట్టులో సిపిఐ నిరసన ఉద్రిక్తం

- గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ఆగ్రహం
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, పోలీసులతో తోపులాట



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. గ్యాస్, పెట్రోల్, డీజిల్ మరియు నిత్యావసర వస్తువుల పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో సిపిఐ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఎట్టకేలకు సిపిఐ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న ఇంధన ధరలు ప్రజలపై భారంగా మారాయని, వెంటనే కేంద్ర ప్రభుత్వం ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, అలాగే మండల నాయకులు పొన్నాల యాదగిరి, సైదులు ముదిరాజ్, కాటి అరుణ, వట్టి నవనీత, డౌల రాములు, పేరాల గోపి, బాల్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాల సమస్య పరిష్కరించిన పున్న గణేష్ నేత



**ఎల్బీనగర్ విశాలభారతి :** రామకృష్ణ పురం డివిజన్ లో ఎస్బిఐ కాలనీలో ఉన్న పలు సమస్యలలో భాగంగా వీధి దీపాల సమస్యను అధికారులతో మాట్లాడి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీధి దీపాల సమస్య నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే పాత వీధి దీపాలను తీసివేసి కొత్తవి ప్రతి చౌరస్తాలో హై వోల్టేజ్ సంబంధించిన ఎల్ఈడి లైట్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఎస్బిఐ కాలనీ రోడ్ నెంబర్ 2 , రోడ్ నెంబర్ 4 డామేజ్ అయిన సిసి రోడ్లను మరియు డ్రైనేజ్ మాన్యువల్ సంబంధించిన సమస్య కూడా త్వరలో ఎస్టిమేట్ వేయించి సాంక్షన్ చేయించడం జరుగుతుందని, శ్రీరామ కృష్ణాపురం డివిజన్లో ఉన్న అన్ని కాలనీలకు సంబంధించిన సమస్యలను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ , మాజీ శాసనసభ్యులు *కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ద్రుష్టికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు . ఈ కార్యక్రమంలో గడ్డి న్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్ SBI కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కనతాల బిక్షం రెడ్డి, జంగయ్య, ముషం శ్రీనివాస్,పాండురంగారెడ్డి, అనంత రెడ్డి,కిరణ్,వంశీ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## సికింద్రాబాద్ కాంగ్రెస్ బలోపేతంపై చర్చలు

**సాయి బాబా జన్మదిన వేడుకల్లో వ్యూహరచన నిర్ణయాలు**



**సికింద్రాబాద్, విశాలభారతి :** సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాయి బాబా జన్మదినోత్సవం సందర్భంగా తార్నాకలోని టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి నివాసంలో సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి డీసీసీ సికింద్రాబాద్ అధ్యక్షులు దీపక్ జాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, అలాగే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ కార్యకర్తల బలోపేతం కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిర్వహించబడింది. ఈ సందర్భంగా టిటియూసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ...... సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర వ్యూహరచన (స్ట్రాటజీ ప్లానింగ్) అమలు విధానాలపై నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పార్టీని ప్రజల్లో మరింత బలంగా తీసుకెళ్లడానికి చేపట్టాల్సిన కార్యాచరణ, స్థానిక సమస్యల పరిష్కారం, యువత, కార్మిక వర్గాల భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే, పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసి విశ్వాసాన్ని పెంపొందించాలనే అంశంపై నాయకులు దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని సాయి బాబాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు బాగు కోసం సహకార పరపతి సంఘాలు

**వ్యవసాయానికి అండగా నిలవడమే లక్ష్యం.. డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరి రెడ్డి**




**డోర్నకల్, విశాలభారతి:** రైతుల ఆర్థికాభివృద్ధి, సాగు అవసరాలకు తక్షణ సహాయం అందించేందుకు సహకార పరపతి సంఘాలు కీలకంగా పనిచేస్తున్నాయని డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరి రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు బ్యాంకుల కంటే సులభంగా రుణాలు, పంట పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాల సరఫరా వంటి సేవలు అందించడమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమన్నారు. రైతు కష్టకాలంలో అండగా నిలిచి, అప్పుల భారం తగ్గించి, సాగు సజావుగా కొనసాగేలా చేయడంలో సహకార పరపతి సంఘాల పాత్ర ఎంతో గొప్పదని ఆయన తెలిపారు. రైతు నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, సభ్యులకు పారదర్శకంగా సేవలు అందించడం ప్రతి సంఘం బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పంట రుణాలు, వడ్డీ రాయితీలు, సబ్సిడీ పథకాలు రైతులకు సకాలంలో చేరేందుకు డీసీసీబీతో పాటు ప్రాథమిక సహకార సంఘాలు వారధిగా నిలుస్తున్నాయని చెప్పారు. రైతు లాభసాటిగా సాగు చేసి ఆర్థికంగా బలపడాలంటే సహకార రంగం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ రైతాంగం అభివృద్ధే తమ ధ్యేయమని, ప్రతి రైతు సహకార సంఘాల సేవలను వినియోగించుకుని లబ్ధి పొందాలని చాపల యాదగిరి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, వెంకంపాడు సర్పంచ్ ఉప్పల సోమన్న, వివిధ గ్రామాల సర్పంచ్ లు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి




**కాప్రా, విశాలభారతి:**

గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నారు వి. ఎస్ .బోస్ సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని డీజిల్ పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్ లో నిరసన నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వి.ఎస్ బోస్ సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అనేక తప్పుడు వాగ్దానాలు చేస్తూ గ్యాస్ సిలిండర్ పెట్రోల్ ధరలు పెంచబోమని ప్రజలను మభ్యపెట్టి ఎన్నికలు అయిపోయిన వెంటనే కమర్షియల్ సిలిండర్ ధరలను ఎన్నడు లేని విధంగా 993 రూపాయలు పెంచడమే కాకుండా గత ఆరు నెలల కాలంలో ఆరుసార్లు పెంచడం జరిగింది. ఉద్యోగాలు లేక చిన్నచిన్న టీ స్టాల్, టిఫిన్ సెంటర్, హోటల్ లు నడుపుకుంటున్న నిరుద్యోగ యువత పై సిలిండర్ల ధరల ప్రభావము తీవ్రంగా పడింది. అనేక టీ స్టాళ్ళు టిఫిన్ సెంటర్లు మూతపడ్డాయి, ఆయా కుటుంబాలు రోడ్ల పడ్డాయి. హోటల్స్ రెస్టారెంట్లలో సిలిండర్ ధర పెరగడం మూలంగా ఆహార పదార్థాల రేట్లను పెంచడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ విధానాల మూలంగా పరోక్షంగా ప్రజలపై పన్ను వేయడమే కాకుండా దోచుకోవడమే అని అన్నారు. అలాగే పెట్రోల్ బంకులలో డీజిల్ పెట్రోల్ కోసం వాహనాలు పెద్ద ఎత్తున క్యూలో నిల్చున్నాయి ఎక్కడ చూసినా బంకులు నో స్టాక్ బోర్డు లు కనిపిస్తున్న కూడా అలాంటిది ఏమి లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పటం ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు మరింతగా పెంచాలని ఆయిల్ సంస్థలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పై ప్రతిపాదనలు పెట్టి ఒత్తిడి చేస్తున్న పరిస్థితిని నెలకొన్నది. కార్పొరేట్ ప్రయోజనాల కోసం దోపిడి వర్గాలకు మరింత లాభాలు చేకూర్చే విధంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నది. పెట్రోల్ డీజిల్ రేట్లు మరింత పెరిగితే అది సామాన్యులపై ప్రభావమే కాకుండా నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతాయి. పేద ప్రజలు ,మధ్యతరగతి వర్గాలు కుటుంబం గడుపుకోలేని పరిస్థితికి నెట్టబడతారు. ధరలు పెరగడానికి యుద్ధమే కారణమని చెప్తున్న నరేంద్ర మోడీ సర్కార్ యుద్ధం ఎవరి కోసం జరుగుతుంది ఎందుకు ట్రంప్ సర్కారుకు బానిసగా వ్యవహరిస్తుందో ప్రజానీకానికి సమాధానం చెప్పాలని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఇరాన్ తో భారతదేశం సంబంధాలను కలిగి ఉన్నది. వాటిని ధిక్కరిస్తూ అమెరికా ట్రంప్ సర్కార్ కి మోడీ ప్రభుత్వం కీలుబొమ్మగా మారింది. ప్రపంచంలోనే ఆయిల్ ఉత్పత్తి చేస్తున్న దేశాలపైన ట్రంప్ ఆధిపత్యం చెలాయిస్తూ తన ఆధీనంలోకి తీసుకోవడానికి పన్నుతున్న కుట్రలో భాగమే ఈ యుద్ధం. భారతదేశ పాలకవర్గాలు మన దేశానికి జరుగుతున్న నష్టాన్ని ఇప్పటికైనా గుర్తించి అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకోవాలని అదే విధంగా ఇరాన్ తో మంచి సంబంధాలు పెంపొందించుకొని ఆయిల్ సరఫరాకు ఏ రకమైన ఆటంకం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన విదేశాంగ విధానంపై ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్రావు, టి. సత్య ప్రసాద్, కే ధర్మేంద్ర, సిపిఐ ఉప్పల్ నియోజకవర్గం నాయకులు నారా నరసింహ, మేడ్చల్ జిల్లా ఏఐవైఎఫ్ ఎం. శేఖర్ సిపిఐ నాయకులు గంధమల్ల మహేష్, ఏఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గం సమితి నాయకులు హర్ష, సురేష్ గుప్తా, వికాస్ పాల్గొన్నారు.

## పరిశుభ్రతే లక్ష్యం.. ఉల్లంఘనలకు ఫైన్



- అశ్వరావుపేటలో కఠిన చర్యలు – షాపుల ముందు చెత్త కనిపిస్తే జరిమానా
- చెత్త కనిపిస్తే షాపులపై తక్షణమే ఫైన్ విధింపు
- లోకల్ ఆటోలపై మున్సిపల్ పన్ను మినహాయింపు నిర్ణయం
- పరిశుభ్రతపై కట్టుదిట్టమైన అమలు కోసం ప్రత్యేక సమావేశం

**అశ్వరావుపేట,విశాలభాతి :**

మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతను కట్టుదిట్టంగా అమలు చేయాలని అశ్వరావుపేట అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అశ్వరావుపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ కంచర్ల భాస్కరరావు, అలాగే వ్యాపారులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి షాప్ యజమాని తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని కమిషనర్ సూచించారు. షాపుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేయడంతో పాటు కవర్లు లేదా సంచుల్లో మూటకట్టి సాయంత్రం షాప్ మూసే సమయంలో బయట ఉంచాలని తెలిపారు. రేపటి నుండి ఏ షాప్ ముందు చెత్త కనిపించినా ఫైన్ విధిస్తామని హెచ్చరించారు. ఇతరులు చెత్త వేస్తే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా లోకల్ ఆటోలపై మున్సిపల్ పన్ను మినహాయింపు ఇవ్వాలని వ్యాపారులు కోరగా, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు సానుకూలంగా స్పందించారు. ఇకపై లోకల్ ఆటోల ద్వారా సరుకులు రవాణా చేసిన వారికి మున్సిపల్ పన్ను ఉండదని ప్రకటించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలు పట్టణంలో శుభ్రతను మెరుగుపరచడంలో కీలకంగా మారనున్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో అశ్వరావుపేట మున్సిపల్ పరిధిలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున సుమారు 20 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సేవే లక్ష్యంగా ముందుకు సాగే ఎమ్మెల్యే

- ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు
- పినపాక ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన ప్రజా నాయకుడు
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**విశాలభారతి, కరకగూడెం:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల కేంద్రంలోనీ అంబేద్కర్ రాజీవ్ సెంటర్ నందు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు, జనహృదయనేత, అభివృద్ధి ప్రదాత మన అభిమాన నాయకులు గౌ. శ్రీ పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, సిబ్బందికి పండ్లు మరియు బ్రెడ్ పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ:**

పినపాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజా సేవకుడు మన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అని తెలిపారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న నిజమైన ప్రజా నాయకుడు అని కొనియాడారు. సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు.అలాగే భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని ప్రజాసేవలో ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ బండి వెంకటేశ్వర్లు , జిల్లా కార్యదర్శి ఎర్ర సురేష్ , సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు వెంకటాపురం సర్పంచ్ చౌలం కేశవరావు , కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత , మాజీ సర్పంచ్ పోలేబోయిన తిరుపతయ్య , తాటిగూడెం ఉపసర్పంచ్ గాంధర్ల రామనాథం , అనంతారం ఉపసర్పంచ్ పూజారి వెంకన్న ,మండల యువజన అధ్యక్షులు కునుసోత్ సాగర్ ,మండల నాయకులు జలగం కృష్ణ , భూక్యా రాందాస్ , కోర్సా బుచ్చయ్య , బిలపాటి సంపత్ , మాజీ ఉప సర్పంచ్ లు కొమరం వెంకటేశ్వర్లు , బాడిష లక్ష్మీనారాయణ , కార్యకర్తలు జాడి శ్రీను , జిమ్మిడి నవీన్ , దుర్గం కన్నయ్య , ధనుంజయ్ ,రాంబాబు , సతీష్ , యువకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



**విశాలభారతి, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం నిర్వహించిన రైతు వారోత్సవ సమావేశంలో ముఖ్య అతిథిగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అనేక అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు తమ పంటలకు సరైన మద్దతు ధర పొందేలా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సాగు నీటి సదుపాయాల మెరుగుదల, పంట నష్ట పరిహారం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. అలాగే రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాపై పోలీసుల కట్టుదిట్టమైన నిఘా

**గంజాల్ టోల్ ప్లాజా చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**



**విశాలభారతి, నిర్మల్ ప్రతినిధి :** బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాల్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వాహనాలను నిలిపి అవసరమైన పత్రాలను పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. అక్రమంగా పశువుల రవాణా నిర్వహించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పర్యవేక్షణ కొనసాగిస్తూ ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీవో ప్రధాన న్యాయమూర్తి

**విశాలభారతి, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్లో బుధవారం ఐటీడీఏ పీవో మంద మకరందు, బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. అదేవిధంగా జిల్లా న్యాయమూర్తి ఎస్ శ్రీ వాణి ను కోర్టు కార్యాలయంలో మరదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఇరువురు సమావేశమై జిల్లాలో ఐటీడీఏ పరిధిలో అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాలపై జిల్లా కలెక్టర్ తో చర్చించారు.

## కాంగ్రెస్ యువ నేత దూడం వెంకట రమణకు

# అరుదైన గౌరవం

- తెలంగాణ హండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం
- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర సీఎస్ రామకృష్ణరావు

**హైదరాబాద్, విశాల భారతి**



తెలంగాణ కాంగ్రెస్ యువ నేత, టీపీసీసీ అధికార ప్రతినిధి దూడం వెంకట రమణకు అరుదైన గౌరవం లభించింది. సుదీర్ఘ కాలం పార్టీలో వివిధ విభాగాల్లో సేవలు అందించిన ఆయనకు... తెలంగాణ రాష్ట్ర హండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా బుధవారం నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఉత్తర్వులు విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో ఆయన చురుకుగా పాల్గొంటూ, ప్రజా సమస్యలపై స్పందించినందుకు ఈ గుర్తింపు లభించిందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేశాయి. అయితే, ఈ సందర్భంగా దూడం వెంకట రమణ మాట్లాడుతూ... ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితర పార్టీ పెద్దలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి




- వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి
- నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం

**పాల్వంచ విశాలభారతి:**

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు విపరీతంగా పెరిగిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సిపిఐ పాల్వంచ మండల, పట్టణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ వద్ద నుండి ప్రదర్శనగా అంబేద్కర్ సెంటర్ చేరుకొని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య మానవుడిపై ఆర్థిక భారం విపరీతంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇంధన ధరలను నియంత్రించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, దీని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడి పేద, మధ్యతరగతి ప్రజల బతుకు భారంగా మారుతోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించకుంటే రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను అటకెక్కించి పేదల నోటికాడ కూడును లాగేస్తున్నారని, వెంటనే పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలను హక్కుగా గుర్తించి నెరవేర్చాల్సింది పోయి, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం సిగ్గుచేటన్నారు. వరి, మొక్కజొన్న పంటలు తక్షణమే ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సరిపడా బస్తాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు, 44డివి జన్ కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, మన్నెం వెంకన్న, జకరయ్య, గొర్ల నరేష్, పునుకుల సర్పంచ్ వజ్జా కృష్ణవేణి నాగారం కాలనీ సర్పంచ్ తేజవత్ వినోద్, గౌతమి కృష్ణ, యాకయ్య, వేములపల్లి శ్రీనివాసరావు, కోటి తిరుపతయ్య, ప్రేమ, మేక రాంబాబు, గూగులోత్ రాములు, వాడే లక్ష్మి, పుష్ప వజ్జా రాజేశ్వరి, వజ్జా లక్ష్మి, ఆదిలక్ష్మి, గడల తిరుపతమ్మ, కమటం ఈశ్వరమ్మ, సమ్మక్క, వెంకటమ్మ, అల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, సంజీవ రావు, ఎస్కే కరీం కోమటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండల ఎఫెక్ట్... ఉపాధి హామీ

# శ్రామికులకు సర్పంచ్ హెచ్చరిక



- నారాయణపురం పంచాయతీలో ప్రత్యేక సమావేశం – పనిస్థలాల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- తీవ్ర ఎండల నేపథ్యంలో శ్రామికులకు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు
- హాజరు నమోదు, పనుల నాణ్యతపై కఠిన మార్గదర్శకాలు
- ఉదయం 6 నుంచి 11 గంటలలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశం

**అశ్వరావుపేట/ విశాలభారతి :**

అశ్వరావుపేట మండలం నారాయణపురం పంచాయతీ పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో ఉపాధి హామీ (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) శ్రామికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కూలీల పనితీరు, హాజరు నమోదు, పనుల నాణ్యత వంటి అంశాలపై సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా పనిస్థలాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రామికులు తగినంత తాగునీరు తీసుకోవడం, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, తల కప్పుకునే ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని తెలిపారు.పనిస్థలాల్లో తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనికి వచ్చిన శ్రామికులు తమ హాజరును సక్రమంగా నమోదు చేయాలని, మస్టర్ రోల్‌లో ఉన్నవారే పనికి హాజరు కావాలని స్పష్టం చేశారు. అలాగే ఉదయం 6 గంటల నుండి 11 గంటలలోపు పనులు ముగించుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పంచాయతీ కార్యాలయానికి తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి పనులు చేపడితే గ్రామ అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, చెరువుల శుభ్రపరిచే పనులు, రోడ్ల మరమ్మత్తులు వంటి కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ మహేశ్వరీ, గ్రామ పెద్దలు, స్థానికులు మరియు ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కూలీల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

## బహిరంగ సభను విజయవంతం చేయాలి



**సికింద్రాబాద్, విశాలభారతి :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా నిజాంపేట అధ్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ కోరారు.తెలంగాణ నలు మూలల నుంచి ప్రజలు తాండోప తండాలుగా కదలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయవలసిందిగా కోరుచన్నామ్మన్నారు. దేశ ప్రధాని రాష్ట్రాలన్నీ విజయకేతన ఎగరవేస్తూ పదో తారీకు పరేడ్ గ్రౌండ్లో నిర్వహించే బహిరంగ సభకు తెలంగాణ ప్రజలు విచ్చేసి,రేపు రాబోయే ఎలక్షన్లు భారతీయ జనతా పార్టీ జెండా ఎగర వేయడం తథ్యం కనుక దయచేసి ఈ యొక్క సభను ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నామని భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నామన్నారు.

## అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** మంచాల మండలం అస్మత్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పల్లెలు సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లులని అన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ ఆలయాల పునరుద్ధరణకు, పండుగల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**జగన్నాధపురం రైతు సంక్షేమ సదస్సులో పాల్గొన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**






**పాల్వంచ, విశాలభారతి:** రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తున్నదని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంస్ మాజీ చైర్మన్,కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నది. పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం రైతు వేదికలో పాల్వంచ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు సంక్షేమ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రైతులకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు.రైతు రుణమాఫీ, ఎకరానికి రెండు దఫాలుగా 12 వేల రూపాయలు రైతు భరోసా, రైతు భీమా, రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర తోపాటు సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్, రైతు వేదికలో రైతులకు శాస్త్రవేత్తల ద్వారా పంటల మెళుకువలు శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నదన్నారు. రైతు సహకార వారోత్సవాలలో రైతులు పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకారాధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూ రావు, హార్టికల్చర్ ఆఫీసర్ కిషోర్, లేబర్ ఆఫీసర్ రాజు, డీసీసీబీ మేనేజర్ స్వప్న, యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజా ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జయశ్రీ, మండల వ్యవసాయ శాఖాధికారి శంభో శంకర్, సొసైటీ సీఈఓ లక్ష్మి నారాయణ, సొసైటీ డైరెక్టర్లు జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ భూక్యా శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, గంధం వీచిన రామయ్య, బి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

- ఇంధన ధరల పెంపుతో సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం
- రచ్చ కిషన్ సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి

**బోడుప్పల్, విశాలభారతి:** బోడుప్పల్ సర్కిల్ 9వ, డివిజన్ వరంగల్ హైవే ఉప్పల్ బస్ డిపో ముందు మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ మరియు డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ.దేశంలోని సాధారణ ప్రజలపై పెరుగుతున్న జీవన వ్యయ భారం నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ (ఎల్పీజీ) ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ పార్టీగా మేము గట్టిగా డిమాండ్ చేస్తున్నాము. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతోంది. దీనివల్ల సామాన్య ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మధ్య తరగతి మరియు దిగువ తరగతి కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి మరింతగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్ మరియు గ్యాస్ ధరలను తగ్గించాలి. అంతేకాకుండా, భవిష్యత్తులో ఇంధన ధరల నియంత్రణ కోసం స్థిరమైన విధానాన్ని అమలు చేయాలి. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాము. లేనిపక్షంలో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని సిపిఐ గా మేము డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మండల పార్టీ సహాయ కార్యదర్శి లో సిహెచ్ మాధవి, జి నాగరాజు, డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి దండు రమేష్, బీసీ సంఘం జిల్లా నాయకులు కె ప్రమీల, బాపురాజు, బి కే ఎం యు మండల కార్యదర్శి మరియు అధ్యక్షులు కే మహాలక్ష్మి, భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు రామతార, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, పి ఆండాలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విశాల భారతి





'సతీ లీలావతి'లో డైరెక్టర్‌గా కనిపిస్తా..

# ఆ సినిమాతో పోల్చొద్దు

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ లావణ్య త్రిపాఠి. ఈ బ్యూటీ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి) సినిమాలను తెరకెక్కించిన తాతినేని సత్య దర్శకత్వం ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతి సినిమాను ఇప్పటికే చూశా. చాలా బాగుంది. సినిమాపై నాకు చాలా నమ్మకముంది. ప్రేక్షకులు ఎలాంటి ఫలితాన్నిస్తారో చూడాలంది లావణ్య త్రిపాఠి. సినిమా షూటింగ్ టైంలో నేను ప్రెగ్నెంట్ అని తెలిసిందే. కానీ మా టీం ఇచ్చిన సపోర్ట్‌తో సులభంగా షూటింగ్ పూర్తి చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. షూట్‌లో చిన్న చిన్న గాయాలవడం సాధారణంగా జరిగేదే కదా. ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కు చెప్పాను. అప్పుడు ప్రెగ్నెంట్ అని నాకు తెలియదు. ఎలాంటి లక్షణాలు కూడా లేవు. షూటింగ్ కూడా అంత సులభమేం కాదని నాకు అర్థమైంది. ఈ సినిమా కోసం బరువు కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. ఇక నుంచి ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్స్‌కు బ్రేక్ ఇస్తానంటూ చెప్పుకొచ్చింది. సతీలీలావతిలో తాను డైరెక్టర్ రోల్‌లో కనిపిస్తానని.. సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుందని చెప్పింది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతిలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటిప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకు రాకూడదు. నేను ప్రెగ్నెంట్ కదా అని మూవీ స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ యాక్షణ్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. తొలిసారి నేను యాక్షన్ సీక్వెన్స్ చేశాను. సినిమాలో కాలితో కొట్టే సీన్ ఒకటి చేసినప్పుడు ఇబ్బందిగా అనిపించిందని చెప్పుకొచ్చింది. ఇందులో సీనియర్ యాక్టర్ నరేశ్, వీటీవీ గణేశ్ అద్భుతమైన పాత్రలు పోషించారు. చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈమూవీని కమల్ హాసన్ సతీ లీలావతితో పోల్చలేం కానీ ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుంది. అదొక క్లాసికల్ మూవీ. దాంతో ఈ సినిమాను పోల్చకూడదంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.